2024 చీకటి వెలుగులు





తొలిసగం: అంతులేని రాచకం

తిరుపతి.. ఊపిరి పీల్చుకుంది!

తొలిసగం: విలువలన్నవి మాటల్లో కట్టే కోటలేగానీ ఆచరణలో అంతా ఒకటే అని తిరుపతి వైసీపీ నాయకులు రుజువు చేశారు. ఎన్నికలకు ముందు వీరి అసహనం హద్దుమీరింది. అభివృద్ధి పేరుతో అవినీతికి రాచబాటలు వేశారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల పేరుతో టీడీఆర్ బాండ్ల మాయాజాలం జరిగిందనే విమర్శలు భగ్గుమన్నాయి. అలాగే టీటీడీ ఛైర్మన్‌గా భూమన కరుణాకరరెడ్డి తీసుకున్న నిర్ణయాల మీదా ఆరోపణలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా తిరుపతికి భారీగా స్వామి నిధులను కేటాయించిన తీరు, అవసరం లేకపోయినా స్విమ్స్ భవనాలు, సత్రాల నిర్మాణం వంటి వాటి వెనుక భారీ కమీషన్ల కతలున్నాయనే ప్రచారం జరిగింది. తిరుపతి ప్రజల ఆరాధ్య దైవం గంగమ్మకూ అపచారం జరిగిందనే అంశం వైరల్ అయ్యింది. 2024 ప్రథమార్థంలో భూమన కుటుంబం తిరుపతి రాజకీయాలను శాసించింది. ఎదురుచెప్పే ధైర్యం ప్రత్యర్థులకే కాదు సొంతపార్టీ నేతలకూ కూడా లేని వాతావరణం నెలకొంది. దాని ఫలితం ఎన్నికల్లో చాచి కొట్టినట్లుగా వెల్లడైంది. రాజకీయ సన్యాసం అని ప్రకటించిన భూమనకూ, ఉజ్వల భవిష్యత్తు ఆశలతో తిరుపతి శాసనసభకు పోటీ చేసిన ఆయన తనయుడు భూమన అభినయరెడ్డికీ తీవ్ర అసంతృప్తినే 2024 మిగిల్చింది.



మలిసగం: తిరుపతి తెరమీదకు అనూహ్యంగా వచ్చిన ఆరణి శ్రీనివాసులు ఎన్నికల సమయంలో సొంతగూటి నుంచే తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొన్నా.. నెమ్మదితనంతో నిలదొక్కుకున్నారు. కూటమి నేతలందరినీ ఒక తాటిమీదకు తీసుకురాగలిగారు. జనసేన ఎమ్మెల్యేగా భారీ విజయాన్ని సాధించిన ఆయన వ్యవహార శైలి.. మునుపటి అధికార నాయకుల శైలికి పూర్తిగా భిన్నమైనది. దురుసుతనం, అహంకారపూరిత ధోరణి లేవు. దీంతో కబ్జాలు, వసూళ్లతో ఎడాపెడా చెలరేగిపోయిన చోటామోటా నాయకులను చవిచూసిన తిరుపతి నగర ప్రజలకు ఊపిరి పీల్చుకునే విరామం అయితే 2024 మలిసగం ఇచ్చింది. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో వుంటున్నారు. అయితే నియోజకవర్గంపై ఇంకా పట్టు సాధించలేదు. అధికారులూ ఎమ్మెల్యే మాట వినడం లేదని అనుచరవర్గం అసంతృప్తిగా వుంది. కుటుంబ సభ్యుల జోక్యంపైనా విమర్శలున్నాయి. ఎమ్మెల్యే పేరు చెప్పుకొని కొందరు అనుచరులు తిరుమలలో అక్రమ తట్టలు మొదలుకుని తిరుపతిలో వసూళ్ల వరకూ దందాలు నెమ్మదిగా మొదలు పెట్టారనే ఆరోపణలు వస్తున్నాయి.

తాము ఏది అనుకుంటే అందే జరగాలనే అహంకారం., జరిగి తీరాలనే దబాయింపు... ఎదురు తిరిగితే దౌర్జన్యం.. కేసులు.. ఐదేళ్లూ రాజకీయమంటే ఇదే అని నమ్మి ఆచరించారు నాయకులు. పోలీసులు సాగిలపడడం.. అధికార యంత్రాంగం తలవంచడం.. తమ బలం అనుకున్నారు. ప్రజల మౌనం తమ పాలనకు అంగీకారంగా భావించారు. భయం కూడా ఒక్కోసారి మౌనాన్నే ఆశ్రయిస్తుంది. అది బ్యాలెట్ పెట్టెల్లోనే బద్దలైంది. విదిలిస్తే చాలు పడివుంటారనుకున్న జనమే ఓడించి గుణపాఠం చెప్పారు. 2024 తొలిసగకాలంలో విర్రవీగి చెలరేగిన నాయకులంతా మలిసగకాలంలో మన్నుతిన్న పాముల్లా మిగిలిపోయారు. ఓడలు బండ్లయిన ఈ విచిత్ర స్థితిని వీక్షిస్తున్నారు ప్రజలు. ఓడిన నేతలనే కాదు.. గెలిచిన నాయకుల తీరునూ గమనిస్తున్నారు. 2024 విభిన్న పార్శ్వాల సమాహారం...

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

మలిసగం: అభివృద్ధికి అడుగులు

శ్రీకాళహస్తిలో కబ్జాల కలకలం తగ్గింది

తొలిసగం: శ్రీకాళహస్తిలో బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాటే శాసనంగా ఐదేళ్లూ నడిచింది. ఎన్నికలకు ముందు కాలంలోనూ ఇదే కొనసాగింది. జనంతో నిత్యం మెలిగే నాయకుడనే పేరున్నా.. భూదందాల ఆరోపణలు హోరెత్తిపోయాయి. పోలీసులూ, అధికార యంత్రాంగం ఆయన మాట జవదాటలేదనే విమర్శలను మూటగట్టుకున్నాయి. ముక్కంటి ఆలయ వ్యవహారాల్లో ఆయన మితిమీరిన జోక్యం.. తీవ్ర చెడ్డపేరును మిగిల్చింది. అనుచరుల పగ్గాలు వదిలేసి అవినీతితో ఆలయాన్ని భ్రష్టుపట్టించారనే ఆరోపణలు వచ్చాయి. ఓటమి తర్వాత నిశ్శబ్దంగా ఉండిపోయిన మధుసూదనరెడ్డి ఇటీవల అధికారులపై విరుచుకుపడి మళ్లీ వార్తల్లోకి వచ్చారు.

మలిసగం: బొజ్జల గోపాలకృష్ణారెడ్డి తనయుడిగా సుధీర్‌రెడ్డికి శ్రీకాళహస్తి జైకొట్టింది. ఆయన కూడా గెలిచాక ప్రజలకు, కేడర్‌కు అందుబాటులో వుంటున్నారు. అయితే కార్యకర్తలైనా, ప్రజలైనా చనువుగా ఆయన దగ్గరకు వెళ్ళలేకపోతున్నారు. ఎమ్మెల్యే అనుచరులమని చెప్పుకుంటూ కొందరు అక్రమ దందాలకు దిగుతున్నారు. వారిని కట్టడి చేయకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. సొంత పార్టీలోనూ, కూటమిలోనూ ఉన్న సీనియర్ నాయకులతో కలివిడిగా ఉండడం లేదనే విమర్శలున్నాయి. శ్రీకాళహస్తి ఆలయ వ్యవహారాల్లోనూ అనుచరవర్గం జోక్యం నెమ్మదిగా పెరగడాన్ని ప్రజలు గమనిస్తున్నారు.



చంద్రగిరిలో ఫలించని సంక్షేమం

తొలిసగం: 2024- చంద్రగిరి రాజకీయాల్లో పెనుమార్పులకు సాక్ష్యంగా నిలచింది. ఐదేళ్లపాటూ పెట్టిన శ్రద్ధా.. పెట్టుకున్న ఆశలూ కల్లలయ్యాయి. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పార్టీ కే పరిమితం అవుతానంటూ కుమారుడు మోహిత్‌రెడ్డిని తెరమీదకు తీసుకువచ్చారు. అయితే అనూహ్యంగా ఆయనే ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగాల్సివచ్చింది. దీంతో పటిష్టమైన కోటగా చెవిరెడ్డి భావించిన చంద్రగిరి రాజకీయాలు మారిపోయాయి. టీడీపీ అభ్యర్థిగా పులివర్తి నాని దూకుడు పెంచారు. ఆయన భార్య సుధారెడ్డి స్థైర్యం, రాజకీయ వ్యూహం వైసీపీని కలవరపెట్టాయి. జిల్లాలో తీవ్ర ఉద్రిక్తతలు ఈ నియోజకవర్గంలోనే చోటు చేసుకున్నాయి. పోలింగ్ తర్వాత నాని మీద జరిగిన దాడి రాష్ట్రంలోనే సంచలనంగా మారింది. మొత్తంమీద వ్యక్తిగత తాయిలాలతో మాత్రమే విజయం సాధ్యం కాదని చంద్రగిరి నిరూపించింది. అటు ఒంగోలులోనూ చెవిరెడ్డి ఓటమి పాలయ్యారు. తన మకాం ఏకంగా బెంగళూరుకే మార్చేశారు.

మలిసగం: చంద్రగిరి ఎమ్మెల్యేగా విజయం సాధించిన నాని ఎన్నికల ముందటి దూకుడు తగ్గించారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులమీద దృష్టి పెంచారు. అయితే రాజకీయంగా మాత్రం ప్రత్యర్థిపై తీవ్రతను ఆయన తగ్గించలేదు. జనానికి, శ్రేణులకు అందుబాటులోనే ఉంటున్నారు. ఇదే సమయంలో ఆరోపణలకు అవకాశం ఇవ్వకుండా ఆయన కుటుంబీకులు తమకు తాముగా పరిమితులు విధించుకోవడం విశేషం.

వైసీపీ ఉనికి చాటిన గురుమూర్తి



ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో వైసీపీ తరపున పోటీ చేసిన వారిలో గెలిచిన ఏకైక అభ్యర్థి గురుమూర్తి మాత్రమే. తిరుపతి సిట్టింగ్ ఎంపీగా ఎన్నికల్లో పోటీ చేసి రెండవసారి గెలిచారు. జిల్లా పరిధిలో చిత్తూరు ఎంపీ అభ్యర్థి, చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్ళూరుపేట, గూడూరు, నగరి, వెంకటగిరి అసెంబ్లీ అభ్యర్థులంతా పరాజయం పాలయ్యారు. గురుమూర్తి ఒక్కరే వైసీపీ ఉనికి కాపాడారు. నెమ్మదస్తుడిగా పేరున్న ఆయన జిల్లా అభివృద్ధి పనుల కోసం ఢిల్లీలో తరచూ అధికారులను కలుస్తుంటారు.

వైసీపీ దళిత ఎమ్మెల్యేలకు చేదు అనుభవం

తొలిసగం: జిల్లాలో ఈ ఏడాది తొలి నాలుగు నెలలూ వైసీపీ దళిత ఎమ్మెల్యేలు ముగ్గురూ సొంత పార్టీ నుంచి చేదు అనుభవం ఎదుర్కొన్నారు. సత్యవేడులో అప్పటి వైసీపీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలానికి అసెంబ్లీ టికెట్ నిరాకరించింది అధిష్ఠానం. మంత్రి పెద్దిరెడ్డి కాళ్లకు మొక్కినా ప్రయోజనం లేకపోయింది. సత్యవేడు అసెంబ్లీ బదులు తిరుపతి పార్లమెంటు టికెట్ ఖరారు కావడంతో ఆగ్రహించిన ఆయన మంత్రి పెద్దిరెడ్డిపై తిరుగుబాటు చేసి వైసీపీ నుంచీ బయటకొచ్చారు. టీడీపీ టికెట్ దక్కించుకుని స్వల్ప మెజారిటీతో గెలిచి తిరిగి అసెంబ్లీలో అడుగుపెట్టారు. సూళ్లూరుపేటలో వైసీపీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు టికెట్ వద్దంటూ సొంత పార్టీ నేతలే బహిరంగంగా గొడవ చేశారు. అవమానకర పరిస్థితుల నడుమ నలిగిన ఆయన చివరికి ఎలాగో టికెట్ తెచ్చుకున్నా ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. గూడూరులో వైసీపీ ఎమ్మెల్యే వరప్రసాద్‌కు కూడా అధిష్ఠానం టికెట్ ఇవ్వకుండా అవమానించడంతో ఆయన బీజేపీలో చేరి తిరుపతి ఎంపీగా పోటీ చేశారు. అయితే గెలవలేదు.

మలిసగం: వైసీపీ నిర్లక్ష్యం చేసినా టీడీపీ ఎమ్మెల్యేగా సత్యవేడు నుంచే గెలిచి సత్తా చూపించారు ఆదిమూలం. అయితే పార్టీకి చెందిన మహిళానేత లైంగిక ఆరోపణలతో ఆయన పేరు ప్రతిష్ఠలకు మచ్చ ఏర్పడింది. టీడీపీ సస్పెండ్ చేసింది. అయితే ఆమే ఫిర్యాదు వెనక్కి తీసుకోవడంతో వివాదం సద్దుమణిగింది. ఇక గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ అభివృద్ధి బాటను ఎంచుకోగా.. సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ విస్తృతంగా ప్రజల్లో తిరుగుతూ రాజకీయ భవిష్యత్తుకు బాటలు వేసుకుంటున్నారు.

మంత్రి లేని జిల్లా

ఈ ఏడాది మొదటి భాగంలో మంత్రిగా జిల్లాకు నగరి ఎమ్మెల్యే రోజా ప్రాతినిధ్యం వహించారు. ఎన్నికల తర్వాత గత ఆరు నెలలుగా జిల్లాకు మంత్రి లేని లోటు కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. మొన్నటి దాకా ముగ్గురు మంత్రులున్న ఉమ్మడి జిల్లాకు కూటమి ప్రభుత్వంలో ఒక్క మంత్రి పదవి కూడా దక్కలేదు. జిల్లా అభివృద్ధిపై సమీక్షించే నేత గానీ, ఎమ్మెల్యేల ప్రతిపాదనలను జిల్లా అధికారులకు, ప్రభుత్వానికి తీసుకెళ్ళే నేత గానీ లేకపోవడం వెలితిగా మారింది.

పదవులు దక్కింది కొందరికే!

కూటమి ప్రభుత్వంలో జిల్లా నుంచీ కొందరికి నామినేటెడ్ పదవులు దక్కాయి. తిరుపతి నుంచీ నలుగురికి పదవులు లభించాయి. శాప్ ఛైర్మన్‌గా అనిమిని రవినాయుడు ఛాన్సు కొట్టేశారు. నరసింహ యాదవ్ తుడా ఛైర్మన్ లేదా టీటీడీ బోర్డు ఛైర్మన్ పదవులు ఆశించగా ఆయనకు యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ దక్కింది. రుద్రకోటి సదాశివం నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి పొందారు. ఈ ముగ్గురూ టీడీపీ వారు కాగా బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి టీటీడీ సభ్యుడిగా నియమితులయ్యారు. మరికొందరికి పదవులు వచ్చినా అవన్నీ కార్పొరేషన్ డైరెక్టర్ వంటివి. ముఖ్యమైన పదవులు ఆశించిన వారికి ఈ ఆరు నెలల్లో అవకాశం దక్కలేదు.

తిరిగి శ్రీవారి సన్నిధికి..



మార్చి 8న శ్రీవారి ఆలయం నుంచి విలపిస్తూ వెళుతున్న గురురాజ్ స్వామి

విలపిస్తూ.. కన్నీళ్లు తుడుచుకుంటూ.. దేవుడికి దండం పెడుతూ.. సాష్టాంగ ప్రణమిల్లి.. ఈ ఏడాది మార్చి 8న తిరుమల శ్రీవారి ఆలయం నుంచి వెనుదిరిగిన టీటీడీ ఉద్యోగి గురురాజ్ స్వామి గుర్తున్నారా..! అప్పట్లో ఓ టీటీడీ ఉన్నతాధికారి కక్ష సాధింపు చర్యతో తిరుపతికి బదిలీ అయిన ఆయన.. తాజాగా తిరిగి శ్రీవారి సన్నిధిలో నియమితులయ్యారు. ఆనాటి ఘటన, పూర్వాపరాలు..

- 8వ పేజీలో

గందరగోళంగా రుద్రాభిషేకం!

● అవస్థలు పడుతున్న భక్తులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో రుద్రాభిషేకం క్రతువు గందరగోళంగా సాగుతోంది. పూజలకు హాజరయ్యే పలువురు భక్తులకు తీవ్ర అవస్థలు తప్పడం లేదు. సాధారణంగా ఎక్కడైనా రోజుకు ఒకసారి లేదా విశేష రోజుల్లో మూలమూర్తి అభిషేకాలను నిర్వహిస్తుంటారు. శ్రీకాళహస్తిలో మాత్రం ప్రతిరోజు నాలుగు కాలాల అభిషేకం జరగడం విశేషం. ఇందులో మూడు కాలాల్లో జరిగే అభిషేకానికి భక్తులను



అనుమతిస్తారు. ఈక్షేత్రంలో మొదట అమ్మవారికి అభిషేకం నిర్వహించి ఆ తరువాత స్వామివారిని అభిషేకించడం ప్రత్యేకత. ఇంతటి ప్రాశస్త్య క్షేత్రం కావడంతో భక్తులు రుద్రాభిషేకాన్ని జరుపించుకునేందుకు ఎంతో ఆసక్తి చూపుతుంటారు. అభిషేకానికి ముందుగా సహస్ర లింగం వద్ద తూర్పు దిశగా భక్తులను ఉంచి సంకల్పం స్వీకరిస్తారు. సుమారు గంట పాటు భక్తులు సంకల్పం పూజలో కూర్చోవాలి. సహస్ర లింగంవద్ద భక్తులు నేలమీదనే కుర్చోవాల్సి వస్తోంది. కీళ్ల సమస్య ఉన్నవారు, వృద్ధులు, దివ్యాంగులు అంత సమయం కింద కూర్చోలేక ఇబ్బంది పడుతున్నారు. ఏదైనా చిన్న పీటలు వంటివి ఇవ్వాలని వీరిలో చాలామంది సిబ్బందిని అడుగుతుంటారు. సంకల్పం పూజలు తర్వాత అమ్మవారి సన్నిధికి చేరుకుని అక్కడ అభిషేకం వీక్షించాలి. ఆ తరువాత స్వామివారి సన్నిధికి చేరుకుని అభిషేకాన్ని జరిపించుకోవాలి. మొత్తం రుద్రాభిషేకం పూర్తయి భక్తులు ఆలయం వెలుపలకు వచ్చే సరికి మూడు గంటలు పడుతుంది. ముందుగా సంకల్పం వద్ద నిలబడే భక్తులకు మొత్తం అభిషేకాన్ని పూర్తిచేసే సరికి నీరసించిపోతున్నారు. ఇక, రుద్రాభిషేకం సంకల్ప పూజల్లో గోత్రనామాలను స్వీకరించిన తరువాత పండితులు వేదమంత్రాలు, రుద్రపారాయణం చేస్తారు. ఈ మంత్రోచ్ఛరణలను శ్రద్ధతో శ్రవణం చేస్తేనే అభిషేక ఫలితంప్రాప్తిస్తుందని భక్తుల నమ్మకం. అయితే సహస్రలింగం వద్ద మూడు వైపులా రూ.5వేల రాహుకేతు పూజలను ఉదయం నుంచి సాయంత్రం వరకు నిత్యం నిర్వహిస్తుంటారు. సరిగ్గా అక్కడే రుద్రాభిషేకం సంకల్ప పూజలకూ స్థానం కేటాయించారు. సంకల్ప పూజల సమయంలో మూడు వైపులా రాహుకేతు పూజలమంత్రాలు గట్టిగా మైకులో చెబుతుంటారు. అక్కడే రుద్రపారాయణం కూడా కొనసాగుతోంది. దీంతో ఏ మంత్రాలో అర్థం కాక భక్తులు గందరగోళానికి గురవుతున్నారు. రూ.5వేల రాహుకేతుపూజలు అయినా, లేదా రుద్రాభిషేకం సంకల్పస్థానాన్ని అయినా సహస్ర లింగం వద్ద నుంచి మార్చాలని భక్తులు కోరుతున్నారు.

అమ్మవారి సేవలో పీవీ సింధు దంపతులు



తిరుచానూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని గురువారం మధ్యాహ్నం భారత బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు దంపతులు దర్శించుకున్నారు. నూతన జంట సింధు, వెంకట దత్తసాయి అమ్మవారి ఆలయం వద్దకు చేరుకోగా టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు ఆలయ మర్యాదలతోస్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శించుకుని పీవీ సింధు దంపతులు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద వీరికి టీటీడీ క్యాలెండర్, డైరీని భానుప్రకాష్‌రెడ్డి అందజేశారు. అనంతరం అలిపిరి నడకమార్గంలో తిరుమల చేరుకున్న వీరు.. శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

అల్పపీడన ప్రభావంతో తీరం వెంబడి గాలులు

సూళ్లూరుపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం బలహీనపడి.. మళ్లీ అల్పపీడనంగా మారిందని వాతావరణ శాఖ పేర్కొంది. దీని ప్రభావంతో 1.5 కిలోమీటర్ల మేర ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. అల్పపీడన ప్రభావంతో వచ్చే 24 గంటలు నెల్లూరు, తిరుపతి జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. దీని ప్రభావంతో తీరం వెంబడి బలమైన గాలులు వీయనున్నాయి. రానున్న రెండు రోజులు రైతులు కూడా అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ తెలిపింది. ఇప్పటికే పలు పోర్టుల్లో మూడో నెంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. చలిగాలుల తీవ్రత కూడా అధికంగా ఉంటుందన్నారు.

ఘాటెక్కిన వెల్లుల్లి

వెల్లుల్లి ఘాటెక్కింది. మూడు నెలల కిందటి వరకు కిలో రూ.280 నుంచి 340 వరకు పలికింది. నేడు ఏకంగా రూ.480కి చేరింది. డిమాండుకు సరిపడా రాకపోవడమే కారణమని అంటున్నారు. ఎందుకంటే తిరుపతి మార్కెట్‌కు వారానికోసారి దాదాపు 60 టన్నులు వస్తాయి. ఇప్పుడు 25 టన్నులు రావడమే గగనంగా ఉందని హోల్‌సేల్ వ్యాపారులు అంటున్నారు. జిల్లాకు అత్యధికంగా మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర నుంచి వెల్లుల్లి వస్తుంది. అక్కడ కూడా దిగుబడి లేకపోవడం.. వచ్చే వెల్లుల్లి కూడా ముళబాగల్, కోలారు, కేజీఎఫ్ ప్రాంతాలకు అత్యధికంగా తీసుకెళ్లడంతో తిరుపతి మార్కెట్‌కు రావడం తగ్గింది. మార్కెట్‌కు కొత్త సరుకు వస్తేనే ధరలు తగ్గే అవకాశం ఉందని వ్యాపారులు అంటున్నారు. ప్రస్తుతం వస్తున్న సరుకు షాపులకు చాలడంలేదు. ఒక్కో దుకాణానికి కనీసం 10 కిలోలు కూడా ఇవ్వడంలేదని అంటున్నారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి



అందాల పోటీల్లో మెరిసిన పాదిరేడు అమ్మాయి

జాతీయ స్థాయి అందాల పోటీలు-2024లో వడమాలపేట మండలం పాదిరేడుకు చెందిన అల్లూరు సుజన మిస్ ఇండియా బ్రాండ్ అంబాసిడర్ అవార్డు దక్కించుకున్నారు. ఈ నెల 21న న్యూఢిల్లీలోని పశ్చిమ విహార్ హోటల్లో జాతీయ స్థాయి అందాల పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో సుజన ప్రతిభ కనబరిచి మిస్ ఇండియా-2024 ఫస్ట్ రన్నరప్‌గా నిలిచారు.



మిస్ ఇండియా బ్రాండ్ అంబాసిడర్ అవార్డు అందుకుంటున్న సుజన

కలికిరి జేఎన్‌టీయూఏలో గ్రాడ్యుయేషన్‌ను పూర్తి చేసిన తనకు కాగ్నిజెంట్ సంస్థలో ఉద్యోగ అవకాశం లభించినట్లు ఆమె చెప్పారు. తల్లిదండ్రులు విశ్రాంత ఉపాధ్యాయురాలు పార్వతి, సెరికల్చర్ ఆఫీసర్ సుబ్రమణ్యం ప్రోత్సాహంతోనే తనకు ఈ అవార్డు దక్కిందన్నారు. ప్రస్తుతం పుత్తూరులో నివాసం ఉంటున్నారు.

- పుత్తూరు అర్బన్, ఆంధ్రజ్యోతి

సమాజానికి ఉపయోగపడే సంస్కరణలకే ప్రాధాన్యం



సదస్సులో మాట్లాడుతున్న నరసింహ

రామచంద్రాపురం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఉపయోపడే సంస్కరణలకే చరిత్రలో ప్రాధాన్యం ఉంటుందని వెంకటేశ్వర యూనివర్శిటీ పరిశోధన, అభివృద్ధి డైరెక్టర్ డాక్టర్ నరసింహవర్మ అన్నారు. వెంకట్రామపురం సమీపంలోని సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలలో గురువారం నుంచి రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి ఉపయోపడే పరిశోధనల వైపు అడుగులు వేయాలన్నారు. గల్గోటియస్ యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ రవీంద్ర బాబు మాట్లాడుతూ సమాచారాన్ని శోధించడం, గుర్తించడం, నిర్వహించడం సరైన పద్ధతిలో జరగాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ ప్రొఫెసర్ శరవణకుమార్, వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్నరాజ, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మయ్య, వెంకటేశ్వర యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ మురళీధర్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పాడిపేటలో సీసీరోడ్డు ప్రారంభం

తిరుచానూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం పాడిపేట గ్రామ పంచాయతీలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పులివర్తి నాని గురువారం ప్రారంభించారు. మొదట రూ.2.52కోట్లతో నూతనంగా నిర్మించిన సీసీరోడ్డును ప్రారంభించారు. ప్రభుత్వ వ్యాయామశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను త్వరితగతిన నెరవేర్చుతున్నామన్నారు. ఈక్రమంలోనే సీసీరోడ్డు పనులను యుద్ధప్రతిపాదికన పూర్తి చేశామన్నారు. టీడీపీ నేతలు సీఆర్ రాజన్, అమిలినేని మధు, ఈశ్వర్‌రెడ్డి, మధుశేఖర్, మునికృష్ణారెడ్డి, కళావతి, మునికృష్ణమనాయుడు, సుబ్రహ్మణ్యంరెడ్డి, కిషోర్‌రెడ్డి, సురేంద్ర నాయుడు, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థిని వైద్యానికి ఆర్థిక సాయం



పాకాల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దామలచెరువు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అనారోగ్యంతో బాధపడుతున్న ఐదో తరగతి విద్యార్థినికి ఉపాధ్యాయులు, విద్యాకమిటీ, గ్రామపెద్ద అహ్మద్ బాషాలు ఆర్థిక సాయం చేశారు. గురువారం పాఠశాలలో మండల విద్యాశాఖాధికారి బాబ్జీ చేతులమీదుగా విద్యార్థిని తల్లిదండ్రులకు రూ.10,560 అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు విజయమోహన్ రెడ్డప్ప, ఉపాధ్యాయులు సీఆర్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సుబ్బయ్యకాలనీలో గుంతల రోడ్డు



తిరుపతిరూరల్, డిసెంబరు26 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం అవిలాల పంచాయతీ పరిధిలో సచివాలయానికి కూతవేటు దూరంలోని సుబ్బయ్యకాలనీలోని మట్టిరోడ్డు గుంతలమయంగా తయారైంది. ఇటీవల వర్షాలకు గుంతల్లో నీరుచేరడంతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా పట్టుతప్పి గుంతల్లో పడే ప్రమాదం ఉందని ద్విచక్ర వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

కొత్త శానంబట్లలో జల్లికట్టుకు అనుమతి ఇవ్వొద్దు

● జిల్లా అధికారులకు గ్రామస్తుల వినతి

చంద్రగిరి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మాగ్రామంలో జనవరి 1న జరిగే జల్లికట్టు కార్యక్రమానికి అధికారులు, పోలీసులు అనుమతి ఇవ్వొదంటున్నారు కొత్తశానంబట్ల గ్రామస్తులు. ఈ గ్రామంలో ఏటా జనవరి 1న జల్లికట్టు నిర్వహిస్తుంటారు. ఈఏడాది జల్లికట్టు వేరొకచోట అనుమతి ఇవ్వాలని వారు గురువారం కలెక్టర్, ఎస్పీలకు వినతిపత్రాన్ని అందజేశారు. జల్లికట్టు కారణంగా కలిగే ఇబ్బందులను వివరించారు. దీనివల్ల ముందు రోజు నుంచి జల్లికట్టు పూర్తయ్యే వరకు రాకపోకలు నిలిచిపోతున్నాయన్నారు. ఇంటి నుంచి బయట రావడానికి కూడా ఇబ్బందిగా ఉంటుందన్నారు. చాన్నాళ్ల తర్వాత సీసీ రోడ్డు వేశారని, జల్లికట్టు కోసం రోడ్డుపై ఎర్రమట్టి పోసి, కార్యక్రమం అయ్యాక మట్టిని తొలగించడంలేదంటున్నారు. మట్టిని జేసీబీతో తొలగిస్తే గుంతలు ఏర్పడతాయన్నారు. అలాగే చాలామంది గాయపడుతున్నారన్నారు. తమ గ్రామంలో అసౌకర్యం, ఇబ్బంది కలిగించే ఈ వేడుకకు .అనుమతి ఇవ్వరాదని కోరారు.

జూట్ బ్యాగ్‌ల తయారీ శిక్షణ కేంద్రం ప్రారంభం



శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ స్వయం ఉపాధితో అభివృద్ధి చెందడమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. యూనియన్ బ్యాంక్ గ్రామీణ ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో నారావారిపల్లెలో గురువారం మహిళలకు జూట్ బ్యాగ్‌ల తయారీ శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళా నెలకు పదివేల రూపాయల సంపాదించేలా ఇక్కడ శిక్షణ పొందాలన్నారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకొంటున్నారన్నారు. కార్యక్రమంలో డీపీవో సుశీలాదేవి, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, సర్పంచ్ లక్ష్మి, ఆర్సేటీ డైరెక్టర్ సురేష్‌బాబు, ఎంపీడీవో శేఖర్, స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ లోకనాథంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వేదోక్తంగా మనోన్మణి ఉత్సవం



శ్రీకాళహస్తి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధనుర్మాసం పురస్కరించుకుని గురువారం వేదోక్తంగా మనోన్మణి(గొబ్బెమ్మ) ఉత్సవం నిర్వహించారు. మొదట ఆలయ అలంకార మండపంలో గొబ్బిదేవతకు పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్చరణల మధ్య అమ్మవారిని చప్పరం అధిష్ఠించి పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని కర్పూర నీరాజనాలు సమర్పించారు.

శ్రీసిటీని సందర్శించిన డీపీఐఐటీ సెక్రటరీ



అమర్‌దీప్ సింగ్‌కు స్వాగతం పలుకుతున్న శ్రీసిటీ ప్రతినిధులు

శ్రీసిటీ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) కార్యదర్శి అమర్‌దీప్ సింగ్ భాటియా గురువారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ సతీష్ కామత్ ఆయనకు స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రగతిని, ప్రత్యేకతలను వివరించారు. డైకిన్ ఏసీ తయారీ పరిశ్రమలో తయారీ కార్యకలాపాలను పరిశీలించారు. శ్రీసిటీలో ఉన్న పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, వ్యాపార అనుకూలత వాతావరణాన్ని అమర్‌దీప్ సింగ్ ప్రశంసించారు. ఆత్మనిర్భర్ భారత్‌కు శ్రీసిటీ ఒక చక్కని ఉదాహరణగా అభివర్ణించారు. అమర్‌దీప్ సింగ్ పర్యటన తమకెంతో ముఖ్యమైనదంటూ శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తిరుచ్చి వాహనంపై ఊరేగిన కల్యాణ వెంకన్న



నారాయణవనం, డిసెంబర్ 26(ఆంధ్రజ్యోతి): నారాయణ వనంలో కొలువైన పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరుని ఆలయంలో ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం ఏకాదశి సందర్భంగా ఉభయ నాంచరులతో కల్యాణ వెంకటేశ్వర స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యపూజలు చేశారు. ప్రత్యేక పుష్పాలతో, స్వర్ణాభరణాలతో అలంకరించి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంరతం ఉభయనాంచారులతో స్వామివారిని మాడవీధులలో ఊరేగించారు. భక్తులు ఏకాదశి ఉపవాస దీక్షతో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారి నాగరాజు, అర్చకులు శ్రీధర్ భట్టాచార్యులు, శ్రీనివాస భట్టాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో తమిళనాడు గవర్నర్



ఆలయం వద్ద ఆర్ఎన్ రవి

తిరుచానూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని గురువారం తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్‌రవి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. డిప్యూటీ గోవిందరాజన్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, అర్చకులు వారికి సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. దర్శనానంతరం రవిని వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.



ఆలయం వద్ద హైకోర్టు జడ్జి టీసీడీ శేఖర్

అమ్మవారిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి

తిరుచానూరులోని శీపద్మావతి అమ్మవారిని గురువారం రాష్ట్ర హైకోర్టు జడ్జి టీసీడీ శేఖర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు అయనకు స్వాగతంపలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా ఖాదర్‌వలీ గంధ మహోత్సవం

శ్రీకాళహస్తి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కైకాలవీధిలో ఉన్న హజరత్ ఖాదర్‌వలీ గంధమహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. దర్గా నిర్వాహకులు దీలు సాహెబ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. దర్గాలో పూల చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అరీఫ్, గఫూర్, ఖాదర్, కాలేషా, జుబేర్, అలి, షెూర, రఫీ, మీర్జావలి తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర గవర్నర్‌కు ఘనంగా వీడ్కోలు

రేణిగుంట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్ర గవర్నర్ సీపీ.రాధాకృష్ణన్‌కు గురువారం బీజేపీ శ్రీకాళహస్తి అసెంబ్లీ కన్వీనర్ కోలా ఆనంద్ ఘనంగా వీడ్కోలు పలికారు. తిరుమల పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణమైన ఆయనకు తిరుపతి విమానాశ్రయంలో కలిసి సత్కరించారు. శ్రీకాళహస్తీశ్వరుని తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి, భరత్‌కుమార్ నాయుడు, హరిష్, పోలయ్య, రాఘవనాయుడు, హరీష్‌రెడ్డి, బిందుకుమార్, గిరిధర్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

రేణిగుంట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి) : పిల్లపాళెం స్వర్ణముఖి ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గాజులమండ్యం పోలీసులు గురువారం సీజ్ చేశారు. స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేశారు.

హుండీలో నగదు చోరీ

పిచ్చాటూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని తులసికృష్ణాపురం వినాయక స్వామి ఆలయంలోని హుండీని బుధవారం రాత్రి దుండగులు పగులగొట్టి అందులోని నగదును దోచుకెళ్లారు. ఆలయ పూజారి సుబ్రహ్మణ్యం ఉదయం గుర్తించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆటో డ్రైవర్ మృతి

రేణిగుంట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ ఆటో డ్రైవర్ మృతి చెందాడు. వాల్‌మార్ట్ సమీపంలో రోడ్డు దాటుతుండగా నాగరాజును గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆయన్ను తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నోషనల్ ఖాతాలో నమోదుతో రైతుల ఇబ్బందులు



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తిరుపతి ఆర్డీవో

పాకాల, డిసెంబరు 26: గాదంకిలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆర్డీవో రామ్మోహన్ పాల్గొన్నారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని అర్జీలను తీసుకున్నారు. రెవెన్యూ. అర్జీలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు సూచించాన్నారు. జిల్లా రైతు సంఘం కార్యదర్శి హేమలత గ్రామ పరిధిలో 137 మంది రైతుల భూములు 2013లో నోషనల్ ఖాతాలో నమోదయ్యాయన్నారు. వరసిద్ధి వినాయక పేరుతో ఉండడంతో క్రయవిక్రయాలకు అవస్థలు పడుతున్నారన్నారు. ఎండోమెంట్ అధికారులు చెప్పినా రెవెన్యూ అధికారులు సమస్య పరిష్కరించడం లేదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ నిత్యానందబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. **చంద్రగిరి:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన రెవెన్యూ సదస్సులో 108 అర్జీలు వచ్చాయి. ఈసందర్భంగా తహసీల్దార్ శివ రావు సుబ్బయ్య మాట్లాడుతూ అర్జీలను తప్పకుండా పరిష్కరిస్తామన్నారు. సర్వేయర్ సురేష్, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. **తిరుచానూరు:** స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం రెవెన్యూసదస్సులో డీటీ జయంత్, ఆర్ఐ రఘువర్మ ఫిర్యాదులు స్వీకరించారు. స్వర్ణముఖి నది తీరప్రాంతాన్ని పరిరక్షించాలని, ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ జయచంద్ర, సాయిలక్ష్మి, సుమన్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. 43 అర్జీలు అందాయి. **రామచంద్రాపురం:** మిట్టకండ్రిగలో రెవెన్యూ సదస్సుకు 40 వినతులు అందాయని తహసీల్దారు వెంకటరమణ తెలిపారు. అధికారులతోపాటు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఏనుగుల దాడుల్లో పంట నష్టపరిహారం పెంచాలి

● మండల సమావేశంలో ఎమ్మెల్యే పులివర్తి నానికి సర్పంచుల వినతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

భాకరాపేట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల సమావేశంలో ప్రజాప్రతినిధులు తమ పరిధిలోని సమస్యలను ఎమ్మెల్యే పులివర్తి నాని ఎదుట ఏకరువు పెట్టారు. చిన్నగొట్టిగల్లులోని స్త్రీ భవన్‌లో గురువారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఏనుగుల దాడుల కారణంగా నష్టపోయిన పంటలకు పరిహారం పెరిగేలా కృషి చేయాలని కోరారు. ఇనుప విద్యుత్ స్తంభాలు మార్చి సిమెంటు స్తంభాలు అమర్చేలా చూడాలన్నారు. వరి, వేరుశనగ పంటల బీమా కోసం 39 మంది కౌలు రైతులకు కార్డులు అందజేశామని వ్యవసాయ అధికారి తెలిపారు. వాతావరణ ఆధారిత బీమా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మామిడి రైతులకు ఉద్యాన శాఖాధికారి శివకుమారి తెలిపారు. మండలానికి 125 గోకులాలు మంజూరైనట్లు పశువైద్యాధికారి స్రవంతి వెల్లడించారు. తలకోన నీటిని చెరువులకు అనుసంధానం చేయడానికి సర్వే పూర్తి చేశామని ఇరిగేషన్ అధికారులు చెప్పారు. చిన్నగొట్టిగల్లు చెరువు కాలువను వెడల్పు చేసి పటిష్ఠ పరిచేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. వడ్డిపల్లె పాఠశాల సమీపంలో కల్వర్టు పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఎంపీపీ యుగంధర్ రెడ్డి, జడ్పీటీసీ స్వరూప, వైస్-ఎంపీపీలు సునీత, దామోదర్ రెడ్డి, ఎంపీడీవో గిడ్డయ్య, తహసీల్దారు జనార్దన్ రాజు, ఈవోపీఆర్‌ఆర్‌డీ సోమశేఖర రెడ్డి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

నమూనా ఆలయ నిర్మాణ పనులు పూర్తిచేయండి

● అధికారులను ఆదేశించిన టీటీడీ జేఈవో గౌతమి

తిరుమల, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): మహాకుంభమేళాలో నమూనా ఆలయ నిర్మాణ పనులను సకాలంలో పూర్తిచేయాలని టీటీడీ జేఈవో గౌతమి అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో గురువారం ఆమె అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా గౌతమి మాట్లాడుతూ.. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు జరుగనున్న మహాకుంభమేళా నేపథ్యంలో జనవరి 12న సంప్రోక్షణ, అచల ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 13నుంచి అన్ని సేవలు జరుగుతాయన్నారు. నమూనా ఆలయంలో దర్శనానికి వచ్చే భక్తులకు అన్నప్రసాదాలు, లడ్డూప్రసాదాలు అందించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. పుష్ప, విద్యుత్ అలంకరణలు చేపట్టాలన్నారు. హెచ్‌డీపీపీ, ఎస్వీ సంగీత కళాశాల, అన్నమయ్య ప్రాజెక్ట్ నుంచి అవసరమైన కళాకారులతో సంగీత, సాహిత్య కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్వీబీసీ, టీటీడీ సోషల్ మీడియా ద్వారా ప్రోమోలు ప్రసారం చేయాలన్నారు. ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులతోపాటు డీపీపీ సెక్రటరీ రఘునాథ్, ప్రోగ్రాం ఆఫీసర్ రాజగోపాల్, డిప్యూటీఈవోలు సెల్వం, శివప్రసాద్, ప్రశాంతి, గుణభూషణ్‌రెడ్డి పాల్గొన్నారు.

వైకుంఠ ద్వార దర్శనంనాడే

తిరుమలలో టికెట్, టోకెన్ భక్తులకు అనుమతి



పోలీసు అధికారులతో కలిసి భద్రతా ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ

తిరుమల, డిసెంబరు26(ఆంధ్ర జ్యోతి): వైకుంఠ ద్వార దర్శనాల ఏర్పాట్లపై టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి గురువారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో సీవీఎస్వో శ్రీధర్, అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ కేంద్రాల్లో భక్తులకు టీ, పాలు, కాఫీ పంపిణీ చేయాలన్నారు. కేటాయించిన దర్శన తేదీన మాత్రమే టోకెన్లు, టికెట్లు ఉన్న భక్తులను తిరుమలకు అనుమతిస్తామన్నారు. ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా పదిరోజులూ వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేశామన్నారు. గోవిందమాల భక్తులకు కూడా ప్రత్యేక దర్శనం లేదన్నారు. ఆరోజుల్లో గదుల అడ్వాన్ రిజర్వేషన్ రద్దు చేశామన్నారు. పార్కింగ్ నుంచి క్యూలైన్ వరకు ఉచిత బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుద్దీపాలు, పుష్పాలంకరణలపై దృష్టిపెట్టాలన్నారు. భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు అధికారులతో కలిసి పరిశీలించారు. క్యూలైన్లు, పార్కింగ్ ప్రదేశాలను చూశారు. రద్దీకి అనుగుణంగా సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, డీఎస్పీ విజయ్‌కుమార్, సీఐలు విజయ్‌కుమార్, శ్రీరాముడు పాల్గొన్నారు.

రేపు, ఎల్లుండి బాలోత్సవం



పోస్టరు విడుదల చేస్తున్న నిర్వాహకులు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని సృజనాత్మకతను, ప్రతిభను వెలికితీసేందుకు ఈనెల 28, 29 తేదీల్లో నగర పరిధిలో బాలోత్సవం(పిల్లల పండుగ) నిర్వహిస్తున్నట్లు బాలోత్సవం వ్యవస్థాపకుడు మల్లారపు నాగరాజు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన గురువారం దానికి సంబంధించిన పోస్టరును విడుదల చేశారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 8 వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొంటారన్నారు. వీరికి ఆటలు, క్విజ్ పోటీలు, క్రీడలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలన్నారు.

రాష్ట్రస్థాయి ప్రతిభా పోటీలకు ఎస్వీయూ విద్యార్థులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్-2047లో భాగంగా చేపట్టే రాష్ట్ర స్థాయి ప్రతిభా పోటీలకు ఎస్వీ యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగానికి చెందిన నలుగురు విద్యార్థినులు ఎంపికయ్యారు. రాష్ట్రంలోని అన్ని కాలేజీలు, యూనివర్సిటీల్లో వికసిత భారత్ పోటీలు చేపట్టనున్నారు. ఈనెల 30వ తేదీన నాగార్జున యూనివర్సిటీలో రాష్ట్రస్థాయిలో చేపట్టే క్విజ్, వ్యాసరచన, పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ వంటి పోటీలకు విద్యార్థినులు పూర్ణిమ, లక్ష్మీలావణ్య, వరలక్ష్మి, కుసుమను ఎంపిక చేశారు. విద్యార్థులను వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, దేవప్రసాదరాజు అభినందించారు.

ఘనంగా సీపీఐ శతవార్షిక వేడుకలు



శ్రీకాళహస్తి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గురువారం సీపీఐ శత వార్షిక ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆయా కార్యాలయాల వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. ప్రజలకు సీపీఐ చేస్తున్నపోరాటాలను వివరించారు. సీపీఐ నాయకులు గురవయ్య, గోపి, మించల శివకుమార్ పాల్గొన్నారు.

సేంద్రియ వ్యర్థాలతో బయోగ్యాస్ ఉత్పత్తి

శ్రీకాళహస్తి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి సమీపంలోని ఎలక్ట్రోస్టీల్ కాస్టింగ్ పరిశ్రమ ఆధ్వర్యంలో బయోగ్యాస్ ప్లాంట్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతిరోజూ 500కిలోల సేంద్రియ వ్యర్థాలను ఈ ప్లాంట్ ద్వారా ప్రాసెస్ చేయవచ్చన్నారు. 18 క్యూబిక్ మీటర్ల పునరుత్పాదక బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో ఎస్ఎన్ గోస్వామి తదితరులు పాల్గొన్నారు.

చేపల వలలో చిక్కుకుని కొండచిలువ మృతి

చిల్లకూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చేపల వలలో చిక్కుకుని కొండచిలువ మృతి చెందిన ఘటన చిల్లకూరు మండలంలోని బల్లవోలు గ్రామానికి చెందిన కొందరు సమీపంలోని సొనకాలువలో చేపల వల వేశారు. వలను బయటకు తీయగా కొండచిలువ ఉండడంతో భయాందోళనకు గురయ్యారు. అయితే పాము మృతి చెందివుండడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి రూ.లక్ష సాయం

నాయుడుపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడి కుటుంబానికి యూటీఎఫ్ జిల్లా నాయకులు రూ.లక్ష సాయం చేశారు. నాయుడుపేట పట్టణంలో నివాసం ఉంటూ దొరవారిసత్రం మండలంలో పనిచేస్తుండిన ఉపాధ్యాయుడు సాయిమోహన్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులకు కుటుంబ సంక్షేమ సంఘం నుంచి రూ.లక్ష చెక్కును యూటీఎఫ్ నాయకులు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, ముత్యాల్‌రెడ్డి, ఉపాధ్యాయుల కుటుంబ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్ఎస్ నాయుడు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట

నాయుడుపేట టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యప్పరెడ్డిపాళెం, మూర్తిరెడ్డిపాళెం స్వర్ణముఖినది నుంచి ఇసుకను అక్రమ రవాణా చేయకుండా అధికారులు చర్యలు చేపట్టారు. అక్ర మంగా ఇసుక రవాణా జరుగుతోందని సమాచారం అందడంతో గురువారం ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసులు, వీఆర్వో మురళి స్వర్ణముఖినది నుంచి ట్రాక్టర్లు వెళ్లకుండా ఎక్స్‌కవేటర్ సహాయంతో దారులను మూసివేయించారు.

పేదల గుండె చప్పుడు వంగవీటి మోహనరంగ

శ్రీకాళహస్తి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): నిరుపేద కార్మికుల గుండె చప్పుడు వంగవీటి మోహనరంగా అన్ని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి మాజీ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు అన్నారు. వంగవీటి మోహనరంగా వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద బలిజ సామాజిక వర్గం ఆధ్వర్యంలో వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిం చారు. పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్య క్రమం లో ఉప్పు కృష్ణయ్య, పూల కృష్ణమూర్తి, స్వర్ణ మూర్తి, అంజూరు వెంకటేష్‌బాబు, సత్య నారాయణ, పురుషోత్తం, శరవణ, సాధన మున్నా తదితరులు పాల్గొన్నారు. రాధారంగా మిత్రమండలి నియోజకవర్గ అధ్యక్షుడు సిద్దులగారి ప్రసాద్ ఆధ్వర్యంలో కార్గిల్ సెంటర్‌లో వంగవీటి మోహనరంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ హాజరయ్యారు

రొయ్యలకు ‘వైట్‌స్పాట్’

● లక్షల్లో చనిపోతున్న పిల్లలు

● లబోదిబోమంటున్న ఆక్వా రైతులు





వైట్‌స్పాట్‌తో చనిపోయిన రొయ్యలు - వ్యాధి సోకిన రొయ్యలు

కోట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వరకు నష్టాలు చవిచూస్తూ వచ్చిన రొయ్య రైతులకు మళ్లీ చేదు అనుభవం ఎదురవుతోంది. దశాబ్దకాలంగా వెనామి రొయ్యలతో లాభాలు గడిస్తూ చివరిదశలో నష్టాలు రావడంతో మళ్లీ ఆక్వా రైతులు టైగర్ రొయ్యసాగుపై దృష్టి పెట్టారు. మూడేళ్లుగా టైగర్ రొయ్యసాగు చేస్తూ వస్తున్నారు. అయితే టైగర్‌కు కూడా వైట్‌స్పాట్ వ్యాధి సోకడంతో మూలిగేనక్కపై తాడికాయ పడ్డట్లుగా ఆక్వా రైతులు నష్టాల ఊబిలోకి వెళ్లిపోతున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో సముద్రతీర ప్రాంతాలైన కోట, చిల్లకూరు, వాకాడు, చిట్టమూరు మండలాలు రొయ్యల సాగుకు ప్రసిద్ధి. ప్రస్తుతం కొన్ని మండలాల రైతులు టైగర్ సాగుచేస్తుండగా కొందరు వెనామి సాగు చేస్తున్నారు. గత 20రోజుల నుంచి బంగాళాఖాతంలో అల్పపీడనాల కారణంగా ఆకాశం మేఘావృతం కావడం, విపరీతంగా మంచు కురవడంతో టైగర్, వెనామి రొయ్యలకు వైట్‌స్పాట్ సోకుతోంది. మంచు 18నుంచి 20 డిగ్రీల వరకు పడిపోవడంతో నీటి సాంద్రత తగ్గిపోయి రొయ్యలకు శ్వాసకోశ సంబంధితమైన వైట్‌స్పాట్ వ్యాధి సోకుతోంది. ఈ వ్యాధి సోకినప్పటి నుంచి రొయ్య పిల్లలు ఆహారం తినడం మానేసి రోజురోజుకూ బలహీనపడిపోతాయి. మొప్పలపై నల్లని, తెల్లని మచ్చలు ఏర్పడి చనిపోయి గుంతల్లోని ఒడ్డుకు చేరుతాయి. కోట మండలంలోని గోవిందపల్లి, గోవిందపల్లిపాళెం, కొత్తపట్నం, వాకాడు మండలంలోని దుగరాజపట్నం గ్రామాల్లో సాగవుతున్న రొయ్యలకు వైట్‌స్పాట్ సోకి లక్షల్లో పిల్లలు చనిపోతున్నాయి. రొయ్య పిల్ల 18 రోజుల నుంచి 60 కౌంట్ వరకు ఈ వ్యాధి సోకుతుంది. ఎన్ని మందులు వాడినప్పటికీ వాతావరణంలో మార్పుల వల్ల వ్యాధి తగ్గకపోవడంతో ఆక్వా రైతులు లబోదిబోమంటున్నారు.

త్వరితగతిన రోడ్ల మరమ్మతులు పూర్తి చేయాలి



వర్చువల్ విధానంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి (కలెక్టరేట్), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి నాటికి రోడ్ల మరమ్మతులు పూర్తి చేయా లని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన వర్చువల్ విధానంలో ఆర్‌అండ్‌బీ అధికారులు, నేషనల్ హైవే పీడీలు, మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా గుంతల్లేని రోడ్లను సిద్ధం చేయాలన్నారు. రహదారులు ఎక్కువ కాలం నాణ్యతగా ఉండేలా పనులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ భూముల్లో భవంతులు కట్టిన వారిపై చర్యలు



మీడియాతో మాట్లాడుతున్న నరసింహయాదవ్

తిరుపతి(వైద్యం), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని భవంతులు కట్టిన వారిపై చర్యలు తప్పవని టీడీపీ తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు గొల్ల నరసింహయాదవ్ స్పష్టం చేశారు. గురువారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రభుత్వ భూములకు తప్పుడు పత్రాలు సృష్టించి, దర్జాగా ఆక్రమించారని తెలిపారు. అందులో కొందరు భవంతులు సైతం నిర్మించారని ఆరోపించారు. ఇందుకు కొందరు అధికారులు కూడా సహకరించారన్నారు. ఆక్రమణలను స్వాధీనం చేసుకోని పక్షంలో నేతలతో పాటు అధికారులపైనా చర్యలు తీసుకుంటామని వివరించారు. కేంద్రం మంజూరు చేసిన నిధులను సైతం పక్కదారి పట్టించారని పేర్కొన్నారు. గాడి తప్పిన పాలనను సక్రమ మార్గంలో నడిపించేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. సమావేశంలో కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, నేతలు హేమంత్, మనోహరాచారి, యశ్వంత్, రవిశంకర్ పాల్గొన్నారు.

హెల్మెట్‌తో తలకు రక్ష



హెల్మెట్ వాడకంపై అవగాహన

తిరుపతి (నేరవిభాగం), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు హెల్మెట్ వాడడం ద్వారా తలను రక్షించుకోవచ్చునని తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపారు. గురువారం రూరల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. అవిలాల సర్కిల్ వద్ద మానవహారం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ హెల్మెట్ ధరించి ప్రయాణం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. రోడ్డు రూల్స్ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు, సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రతిభావంతులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

తిరుపతి(గాంధీరోడ్డు), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేకావసరాలు గల వారిని గుర్తించి, ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు తగు చర్యలు చేపట్టాలని సహిత విద్య రాష్ట్ర సహాయ సమన్వయకర్త మల్లికార్జున తెలిపారు. న్యూ బాలాజీ కాలనీలోని ఎంఎంబీజీ స్కూల్ ఆడిటోరియంలో జిల్లాలోని ఎంఈవోలకు సహిత విద్యపై గురువారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యూడైస్ ప్లస్‌లో ప్రత్యేక ప్రతిభావంతులను నమోదు చేసి, వారికి ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సదుపాయాలు అందేలా చూడాలని సూచించారు. సహిత విద్య ప్రాముఖ్యత, దివ్యాంగ విద్యార్థులను గుర్తించి పాఠశాలలో చేర్పించడం, వారికి ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు, పథకాలు, సదరం ధ్రువీకరణ పత్రాలు, ప్రశస్తయాప్ వంటి వివరాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా విశదీకరించారు. యూడైస్ ప్లస్ పైనా అవగాహన కల్పించారు. సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్ చంద్రశేఖర రెడ్డి, ప్లానింగ్ కో-ఆర్డినేటర్ రామచంద్రారెడ్డి, ఏఎల్ఎస్ శ్రీధర్, సమగ్రశిక్షా సెక్టోరియల్స్ పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



వసుధ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పద్మావతి యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ పరిశోధకురాలు కె.వసుధ డాక్టరేట్ పొందారు. ఏ స్టడీ ఆన్ గ్రీన్ ఇంటర్న్‌షిప్ రోల్ టువర్డ్స్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ ఆఫ్ సౌత్ ఇండియా అంశంపై ప్రొఫెసర్ శోభారాణి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు.

బాలోత్సవం న్యాయ నిర్ణేతల సమావేశం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఈనెల 28వ తేదీ నుంచీ తిరుపతి బాలోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో న్యాయ నిర్ణేతల సమావేశాన్ని నిర్వహించారు. యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో గురువారం సాయంత్రం ఈ సమావేశం నిర్వహించారు. ఏయే పోటీలు నిర్వహిస్తున్నారు? తరగతులు, వయసు వారీగా పోటీలు ఎలా నిర్వహించాలి? విజేతలను ఎలా ఎంపిక చేయాలనే విషయంపై నిర్వాహకులు మార్గదర్శకాలను తెలియజేశారు.

ఘనంగా వీర్ బాల్ దివస్



గురుద్వార్ విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న బీజేపీ నాయకులు

తిరుపతి(విద్య), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వీర్ బాల్ దివస్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు గురువారం తిరుపతిలో ఘనంగా నిర్వహించారు. మొఘలుల దాష్టీకానికి బలైన ఇద్దరు చిన్నారుల ప్రాణత్యాగాన్ని గుర్తుచేసుకుంటూ ఏటా డిసెంబరు 26న వీర్ బాల్ దివస్ నిర్వహిస్తారు. స్థానిక రాములవారి ఉత్తర మాడవీధిలోని గురుద్వార్ సిక్కు విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. గురుద్వార్ విద్యార్థులకు చిత్రలేఖనం పుస్తకాలు, పెయింటింగ్ బ్రష్‌లు అందజేశారు. కార్యక్రమంలో సిక్కులు జేపీ ధనసింగ్, జేసీ సుజాతబాయ్, బీటీ గాయత్రిబాయ్, జేపీ రాధికబాయ్, జేకే ధీరజ్ సింగ్, జేకే కనిష్‌సింగ్, బీజేపీ నేతలు పాటిబండ మురళి, సుబ్రహ్మణ్యం యాదవ్, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు

తిరుపతి అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు శాంత స్ఫూర్తి ఫౌండేషన్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఇంటర్, డిగ్రీ పాస్ లేక ఫెయిల్ అయిన 18 నుంచి 28సంవత్సరాల లోపు తిరుపతి ప్రాంత అభ్యర్థులు అర్హులని తెలిపింది. రిజిస్ట్రేషన్ కోసం శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటలకు తనపల్లిక్రాస్‌లోని హోటల్ తాజ్‌కు ఆధార్, పదవ తరగతి, ఇంటర్ మార్కులిస్టులు, రేషన్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకురావాలని తెలిపింది. 45రోజులు శిక్షణ ఇచ్చి కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగం కల్పించనున్నట్లు తెలిపింది. మరిన్ని వివరాలకు 9000469989ను సంప్రదించాలని సూచించింది.

నేడు చిరుధాన్యాలు, సేంద్రియ ఉత్పత్తుల మేళా

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి రాస్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం చిరుధాన్యాలు, సేంద్రియ ఎరువుల ఉత్పత్తుల మేళా నిర్వహించనున్నామని కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.



బస్సులు శుభ్రం చేసే స్థలంలో పెద్ద గుంత - డిపోకు దక్షిణంగా కూలిపోయిన ప్రహరీ గోడ - పగిలిన గ్యారేజీ రేకులషెడ్డు

అభివృద్ధికి 'మంగళం'

ఆర్టీసీ డిపోలో సమస్యల కొలువు

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మంగళం ఆర్టీసీ డిపో అండ్ గ్యారేజీ కనీస వసతులకు నోచుకోవడం లేదు. అనేక సమస్యల మధ్య అక్కడి సిబ్బంది పనిచేస్తున్నారు. డిపోను ఏర్పాటు చేసి 11 ఏళ్లు అవుతున్నా అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించలేదు. ఆవరణ పూర్తిగా గుల్లతేలిపోయింది. పెద్దపెద్ద గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిల్వ ఉంటోంది. బస్సులను శుభ్రం చేసే స్థలంలో గుంతలు బావులను తలపిస్తున్నాయి. గ్యారేజీ పైకప్పుకు ఏర్పాటు చేసిన రేకులు పగిలిపోయి ఉన్నాయి. వర్షానికి ఉరుస్తుండడంతో విలువైన వస్తువులు తడిచిపోతున్నాయి. ఆవరణ చుట్టూ పారిశుధ్యం లోపించింది. వ్యర్థాలు, వాటర్ బాటిళ్లు కుప్పలుగా పేరుకుపోయాయి. రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షానికి తూర్పు, దక్షిణ దిశలలోని ప్రహరీ గోడలు కూలిపోయినా వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. పరదాలు కట్టి కాలం గడిపేస్తున్నారు. తద్వారా భద్రత లోపించింది. సెక్యూరిటీ ప్రధాన గేటు వద్ద రోడ్డు కుంగిపోయి ఎత్తుపల్లాలుగా దర్శనమిస్తోంది.





గ్యారేజీ ముందుభాగంలో గుంతలు - ప్రహరీ చుట్టూ వ్యర్థాలు, వాటర్‌బాటిళ్లు

పంట పొలాలను కబ్జా చేశారు

రెవెన్యూ సదస్సులో రైతుల ఫిర్యాదు



తహసీల్దారుకు అర్జీ అందిస్తున్న వికలాంగుడు మురుగేష్

తిరుపతి అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): 'పచ్చటి పంట పొలాలను కబ్జా చేశారు..ప్రశ్నిస్తే దౌర్జన్యం చేస్తున్నారు.. న్యాయం చేయండి' అంటూ మంగళం గ్రామానికి చెందిన పలువురు రైతులు రెవెన్యూ అధికారులను వేడుకున్నారు. గురువారం మంగళంలో అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మంగళం చుట్టుపక్కల పొలాలు కబ్జాకు గురయ్యాయని, మిట్టగాంధీపురంలో శ్మశానం కబ్జాకు గురైందని, సప్తగిరి కాలనీలో నకిలీ పట్టాలతో ఖరీదైన ఇళ్ల స్థలాలు ఆక్రమించారని బాధితులు అధికారులకు విన్నవించారు. మంగళం బీసీఎం స్కూల్ వెనుక స్థలానికి సంబంధించి న్యాయస్థానం ఉత్తర్వులున్నా ఇళ్ల నిర్మాణానికి రెవెన్యూ అధికారులు అభ్యంతరం చెబుతున్నారని బాధితులు తెలిపారు. అలాగే 22ఏకు సంబంధించి 69, పట్టా బదిలీలకు 18, ఇతరాలు 27 అర్జీలు అందాయి. సదస్సులో డీటీ రామచంద్ర, ఆర్ఐ కృష్ణమ్మ, సర్వేయర్ జగదీష్, వీఆర్వో సతీష్, టీడీపీ నాయకులు ఈశ్వరయ్య, శ్రీనివాసులయాదవ్, సురేష్‌నాయుడు, చిన్నరెడ్డిబాబు, భాస్కర్‌రెడ్డి, గోపాల్‌యాదవ్ పాల్గొన్నారు.

విదేశాల్లోని హిందువుల గురించి ఆలోచించాలి



టీటీడీ పరిపాలన భవనం వద్ద నిరసన తెలుపుతున్న చింతా మోహన్

తిరుపతి(వైద్యం), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అన్యమతం అనే ముందు ఇతర దేశాల్లో ఉద్యోగాలు చేసే మన హిందువుల గురించి ఆలోచించాలని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ అన్నారు. టీటీడీ పరిపాలనా భవనం ముందు గురువారం ఆయన కాంగ్రెస్ నేతలతో కలిసి ఆందోళన చేపట్టారు. ప్రతీ దానికీ అన్యమతం అని చిన్నచూపుగా మాట్లాడడం ద్వారా క్రైస్తవుల దేశంలోని హిందువుల ఉద్యోగాలు పోయే ప్రమాదముందని పేర్కొన్నారు. టీటీడీలో పనిచేసే ప్రధాన అర్చకులకు, అర్చకులకు, శాశ్వత ఉద్యోగులకు, జర్నలిస్టులకు అలిపిరి నుంచి పేరూరు వరకు ఉన్న టీటీడీ భూముల్లో 5 సెంట్లు చొప్పున కేటాయించాలని డిమాండ్ చేశారు. టీటీడీలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రూల్ ఆఫ్ రిజర్వేషన్లు అమలు చేసి ప్రమోషన్లు కల్పించాలన్నారు. జనవరి 1, వైకుంఠ ఏకాదశి రోజున తిరుపతి స్థానికులకు ఐదువేల మందికి ఉచిత దర్శనం కల్పించాలని కోరారు. స్విమ్స్‌లో నిరుపేదలకు ఉచిత వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు యార్లపల్లి గోపిగౌడ్, రవి, తేజోవతి, మునిశోభ, రావణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వంగవీటి రంగాకు ఘన నివాళి



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తదితరులు

తిరుపతి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సామాజిక న్యాయం కోసం పోరాడిన నాయకుడు వంగవీటి మోహన రంగా అని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ పేర్కొన్నారు. రంగా ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరముందని తెలిపారు. అనంతవీధి సర్కిల్‌లో రాధా-రంగ మిత్రమండలి అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో రంగా 36వ వర్ధంతి నిర్వహించారు. ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలతో పాటు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొని రంగా చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. పేదలకు అన్నదానం చేశారు. వారు మాట్లాడుతూ నాయకుడిగా, ఎమ్మెల్యేగా వంగవీటి రంగా పేదల పక్షాన పోరాడాడని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఊకా విజయ్ కుమార్, డాక్టర్ కోడూరి బాలసుబ్రమణ్యం, బుల్లెట్ రమణ, ఆముదాల తులసీరాం, పాటకం వెంకటేష్, జనసేన నాయకులు రాజారెడ్డి, వినోద్ రాయల్, ఆముదాల వెంకటేష్, శేషాద్రి, నీలాద్రి, అంజిబాబు, మౌల, బుజ్జి, తోట జయంతి, శిరీష, మధుబాల తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుకు బెదిరింపుపై ఫిర్యాదు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టును బెదిరించిన నేతపై ఏపీయూడబ్ల్యూజే నాయకులు గురువారం ఎస్పీ సుబ్బరాయుడుకు ఫిర్యాదు చేశారు. ఒక దినపత్రికలో ప్రచురితమైన వార్తకు సంబంధించి విలేకరిని పాకాలకు చెందిన వార్డు మెంబరు రావిళ్ల మోహన్ నాయుడు 'అంతు తేలుస్తాను' అంటూ హెచ్చరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సదరు నేతపై చర్యలు తీసుకోవడమేగాక జర్నలిస్టుకు రక్షణ కల్పించాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో ఏపీ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ నాయకులు కోలా లక్ష్మీపతి, ఏపీయూడబ్ల్యూజే నాయకులు మబ్బు నారాయణ రెడ్డి, ప్రెస్‌క్లబ్ జాయింట్ సెక్రటరీ విజయయాదవ్, గిరిధర్, ఉమాపతి, ప్రవీణ్ ఉన్నారు.

కథలకు దృశ్య రూపం

పద్మావతి యూనివర్సిటీలో కసరత్తు

ఐదు రోజుల వర్క్‌షాప్ చేపట్టిన జర్నలిజం విభాగం



కార్యక్రమంలో పాల్గొన్న త్రిపురసుందరి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కథలకు దృశ్యరూపం ఇచ్చేందుకు పద్మావతి మహిళా యూనివర్సిటీ కసరత్తు చేస్తోంది. ఇందుకోసం ఆ వర్సిటీ జర్నలిజం విభాగం ఐదు రోజుల వర్క్‌షాప్ చేపట్టింది. మద్రాసుకు చెందిన నిపుణురాలు సౌమ్యా అయ్యాల్ తదితరులు కథలను దృశ్యరూపంగా మార్చేందుకు అవసరమైన అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్మార్ట్ క్లాస్ రూంలో ప్రయోగాత్మకంగా ఈ అంశాలను ఆమె వివరించారు. ప్రొఫెసర్ త్రిపురసుందరి మాట్లాడుతూ నిత్య జీవితంలోని ప్రతి విషయాన్నీ దృశ్య రూపంలో అందించడం ద్వారా సామాన్యులకు కూడా సమాచారాన్ని చేరవేయవచ్చన్నారు. అయితే ఆసక్తిగా మలిచేందుకు అవసరమైన పదజాలం, విజువల్స్‌ను క్రోనలాజికల్ ఆర్డర్‌లో పొందుపరుస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కాత్యాయిని, ప్రొఫెసర్ శోభారాణి పాల్గొన్నారు.

నేడు అంతర్జాతీయ సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో శుక్రవారం నుంచి మూడు రోజులు అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. మెడిసిన్ అండ్ క్యాన్సర్ థెరపిటిక్స్ అంశంపై బయోటెక్నాలజీ విభాగం ఈ సదస్సు చేపట్టనుంది. ఉదయం 9 గంటలకు సెనేట్ హాల్లో ప్రారంభ సభ నిర్వహిస్తారు. యూఎస్ఏకి చెందిన శాస్త్రవేత్త మల్లా మిథున్ కీలకోపన్యాసం చేస్తారు. వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, ఎమ్మెల్యే థామస్, తైవాన్‌కు చెందిన ప్రకాష్, హెచ్‌సీయూ ప్రొఫెసర్ మాధవరెడ్డి తదితరులు పాల్గొంటారని సదస్సు డైరెక్టర్ ప్రొఫెసర్ కేవీ సుచరిత తెలిపారు.



కత్తిరించి వదిలేశారు

కరకంబాడీ రోడ్డు డివైడర్‌లో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను కొన్ని రోజుల క్రితం కత్తిరించారు. అయితే వాటిని తొలగించకుండా రోడ్డుపైనే వదిలేశారు. దీంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రివేళ వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు దారితీస్తున్నాయి. తొలగించిన మొక్కలను తక్షణమే తరలించాలని పలువురు కోరుతున్నారు.

- తిరుపతి అర్బన్, (ఆంధ్రజ్యోతి)

నడిరోడ్డులో మొరాయించింది





నడిరోడ్డుపై నిలిచిపోయిన బస్సు

సెంట్రల్ బస్టేషన్ నుంచి గురువారం మధ్యాహ్నం ప్రయాణికులతో బయల్దేరిన తమిళనాడు ఆర్టీసీ బస్సు సాంకేతిక సమస్యతో ఉదయా ఇంటర్నేషన్ హోటల్ ఎదురుగా నడిరోడ్డులో ఆగిపోయింది. డ్రైవర్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దాదాపు అర్ధగంట అక్కడే ఉండిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు స్పందించి ట్రాఫిక్‌ను దారి మళ్లించారు. కొంతసేపటి తర్వాత బస్సు స్టార్ట్ అవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

- తిరుపతి(ఆర్టీసీ), (ఆంధ్రజ్యోతి)



'కొండ'ంత జనం

వరుస సెలవులతో భక్తులు తిరుమలకు పోటెత్తారు. ఎటు చూసినా రద్దీనే కనిపిస్తోంది. సర్వదర్శన క్యూ కృష్ణతేజ గెస్ట్‌హౌస్ మీదుగా రింగురోడ్డులో శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వీరికి దాదాపు 20 గంటల దర్శన సమయం పడుతోంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఒక రోజు ముందే పింఛన్ల పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఈనెల 31వ తేదీనే పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు గురువారం తెలిపారు. జిల్లాలో 2,63,995 మంది లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.112 కోట్లు కేటాయించిందన్నారు. 31న అందని వారికి జనవరి 2వ తేదీన పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

శిలాతోరణం సర్కిల్ దాకా క్యూలైన్

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 20 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరి షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. శిలాతోరణం సర్కిల్ వరకు క్యూలైన్‌లో భక్తులు వేచివున్నారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

మంగళవారం నాటి హుండీ ఆదాయం: రూ.4.14 కోట్లు


బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 73,301

తలనీలాలు సమర్పించినవారు: 26,242



బొక్కసం సూపరింటెండెంట్‌గా

మళ్లీ గురురాజ్ స్వామి



- గత ప్రభుత్వంలో కక్షసాధింపు చర్యలకు గురైన వైనం
- తొలుత ఆలయం, ఆపై తిరుమల నుంచే బదిలీ
- తాజాగా శ్రీవారి ఆలయంలో పోస్టింగ్

తిరుపతి/తిరుమల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయం బొక్కసం సూపరింటెండెంట్‌గా గురురాజ్ స్వామి గురువారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. గత ప్రభుత్వంలోని అధికారులు కక్షసాధింపుతో ఆయన్ను మార్చిలో శ్రీవారి ఆలయం నుంచి తిరుపతికి బదిలీ చేసిన విషయం తెలిసిందే. శ్రీవారి ఆలయంతో ఎంతో అనుబంధమున్న ఆయన తిరుమల నుంచి వెళుతూ కన్నీరు పెట్టుకోవడం అప్పట్లో చర్చనీయాశంగా మారింది. ఈయన గురురాజ్ స్వామి 2002లో టీటీడీలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగంలో చేరారు. తొలి నుంచీ శ్రీవారి ఆలయంలోనే విధులు నిర్వర్తించారు. ఆపై బొక్కసం క్లర్కుగా, తర్వాత బొక్కసం సూపరింటెండెంట్‌గా పదోన్నతులు పొందారు. శ్రీవారి ఆలయంలో బొక్కసం ఇంఛార్జి డాలర్ శేషాద్రి వద్ద సహాయకుడిగా ఉంటూ శ్రీవారి కైంకర్యాలు, పూజాదికాలు, ప్రత్యేక దినాలు, ఉత్సవాల్లో కార్యక్రమాల నిర్వహణపై అవగాహన పెంచుకున్నారు. ముఖ్యంగా బొక్కసం క్లర్కుగా, సూపరింటెండెంట్ హోదాల్లో శ్రీవారి ఆలయంలో మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు రోజువారీ, ప్రత్యేక దినాల్లో అంలకరించే అత్యంత విలువైన ఆభరణాలు, బంగారు, వెండి వస్తువులన్నీ ఈయన అధీనంలోనే ఉండేవి. మూలవిరాట్టుకు, ఉత్సవరకుఉ ఏ రోజుల్లో ఏ ఆభరణాలు అలంకరించాలన్న దానిపైనా లోతైన అవగాహన ఉంది. ఆలయంలో అర్చకులకు, టీటీడీ అధికారులకు నడుమ సంధానకర్తగా, సమన్వయకర్తగానూ వ్యవహరించేవారు. సుమారు రెండు దశాబ్దాల పాటు శ్రీవారి ఆలయంలో పని చేసినా ఆయనపై ఎలాంటి ఆరోపణలు, ఫిర్యాదులూ వచ్చిన దాఖలాలు లేవు. అయితే శ్రీవారి ఆలయంలో కీలకంగా వ్యవహరించే క్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖులు, వివిధ మఠాధిపతులు, పీఠాధిపతులతో పరిచయాలు ఏర్పడ్డాయి. సరిగ్గా అక్కడే గత వైసీపీ ప్రభుత్వంలో టీటీడీ ఉన్నతాధికారి ఒకరికి నచ్చలేదన్న ప్రచారం జరిగింది. ఆ కారణంగా గురురాజ్‌స్వామిని తొలుత 2020లో శ్రీవారి ఆలయం నుంచి వెలుపలికి బదిలీ చేశారు. వైభవోత్సవ మండపంలో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. తర్వాత ఈ ఏడాది మార్చి 8న తిరుమల నుంచీ తిరుపతిలోని టీటీడీ అకౌంట్స్ విభాగానికి బదిలీ చేశారు. అదే రోజున ఆయన శ్రీవారిని దర్శించుకుని ఆలయం నుంచీ వెలుపలికి వచ్చి విలపిస్తూ వెళ్లిపోయారు. వాస్తవానికి డాలర్ శేషాద్రి మరణంతో ఆయన స్థానాన్ని గురురాజ్‌స్వామితో భర్తీ చేస్తారని టీటీడీ వర్గాలు భావిస్తున్న తరుణంలో ఆయన్ను ఏకంగా తిరుమల నుంచే కిందకు బదిలీ చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఉద్యోగంలో చేరినప్పటి నుంచీ శ్రీవారి సన్నిధిలోనే గడిపానని, వైభవోత్సవ మండపానికి బదిలీ చేసినా కొండపైనే శ్రీవారి ఆలయ సమీపాన్నే కాబట్టి సంతోషంగా విధులు నిర్వర్తించానని అప్పట్లో ఆయన సన్నిహితులకు చెప్పుకొన్నారు. అయితే కొందరు కక్షకట్టి తిరుమలలోనే ఉండకుండా బదిలీ చేయించడం తట్టుకోలేకపోతున్నానంటూ వాపోయారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక టీటీడీపై దృష్టి సారించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా శ్రీవారి ఆలయంలో బొక్కసం నిర్వహణకు, అలాగే అర్చకులు, అధికారుల నడుమ సమన్వయానికి సంబంధించి అవగాహన కలిగిన ఉద్యోగులు లేకపోవడాన్ని ఉన్నతాధికారులు గుర్తించినట్టు సమాచారం. దీంతో గురురాజ్‌స్వామిని తిరిగి శ్రీవారి ఆలయానికి బదిలీ చేస్తూ గురువారం టీటీడీ ఉత్తర్వులు జారీ చేసింది.

> ఈ బదిలీకి సంబంధించి ఎలాంటి మార్పుచేర్పులు, రద్దు వంటి అభ్యర్థనలను, ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకునేది లేదంటూ ఈ ఉత్తర్వుల్లో పేర్కొనడం గమనార్హం. ఈ విధంగా ఏ స్థాయి అధికారికి గానీ బదిలీ ఉత్తర్వుల్లో పేర్కొనడం అత్యంత అరుదనే చెప్పాలి. స్వామివారే తన సేవకు మళ్లీ పిలిపించుకున్నారని గురురాజ్‌స్వామి 'ఆంధ్రజ్యోతి'తో సంతోషం వ్యక్తం చేశారు.

ఎర్రెర్రని జెండా

- ఘనంగా సీపీఐ శత ఆవిర్భావ దినోత్సవం

జిల్లాలో గురువారం సీపీఐ శత ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఎర్ర తోరణాలు, ఫ్లెక్సీలు, జెండాలతో తిరుపతి నగరం ఎరుపెక్కింది. అన్నమయ్య కూడలి నుంచి బైరాగిపట్టెడలోని పార్టీ కార్యాలయం వరకు కళాబృందాలతో ర్యాలీ నిర్వహించారు. పద్మావతి పార్క్ వద్ద కేక్ కట్ చేశారు. పార్టీ కార్యాలయంలో పతాకావిష్కరణ చేశారు. అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. పార్టీ వందేళ్ల చరిత్రను గుర్తు చేస్తూ ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన విప్లవ గీతాలు ఆకట్టుకున్నాయి. అమరవీరుల త్యాగాల స్ఫూర్తిగా ప్రజా సమస్యలపై పోరాటాలు చేయడానికి ముందుకురావాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పి.మురళి, నగర కార్యదర్శి విశ్వనాథ్, కె.శివారెడ్డి, సి.పెంచలయ్య, రాధాకృష్ణ, బి.నదియా, చంద్రేఖరరెడ్డి, ఎన్.డి.రవి, గుర్రప్ప, నాగరాజు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

- తిరుపతి(ఆటోనగర్), ఆంధ్రజ్యోతి



పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న హరినాథ రెడ్డి తదితరులు



తిరుపతిలో సీపీఐ నేతల ర్యాలీ

పడవ పోటీల ప్రాక్టీస్ సెషన్స్ ప్రారంభం



రాయలచెరువులో బోట్లను పరిశీలిస్తున్న శాప్‌చైర్మన్ రవినాయుడు

రామచంద్రాపురం/తిరుపతి(క్రీడలు), డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం మండలం రాయలచెరువులో గురువారం పడవ (డ్రాగన్ బోట్) పోటీల ప్రాక్టీస్ సెషన్స్ ప్రారంభమయ్యాయి. చిత్తూరు, నెల్లూరు, కర్నూలు, విజయవాడ, వైజాగ్ జిల్లాల నుంచి జూనియర్, సీనియర్ విభాగాలకు 40మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఉదయం 7.30 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు ప్రాక్టీసు సెషన్స్ కొనసాగాయి. చెరువులో 1,000మీటర్ల పొడవుతో 30రౌండ్స్ వేశారు. ఒక్కోదానిలో 12మంది చొప్పున కూర్చొని పడవను వేగంగా ముందుకు నడిపారు. చిన్న పడవల్లో ఒక్కొక్కరూ నడిపారు. క్రీడాకారులు చేస్తున్న పొరపాట్లను అక్కడే ఉన్న కోచ్‌లు గమనించి ముఖకవళికలతో కూడిన శిక్షణ ఇచ్చారు. ఇలా 29వ తేదీ వరకు ప్రాక్టీస్ సెషన్స్ చేస్తూ 30, 31 తేదీల్లో అధికారిక టైమింగ్స్‌కు పడవ పోటీలు నిర్వహిస్తారు. అందులో ప్రతిభ కనబరిచినవారు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారు. గురువారం శాప్‌చైర్మన్ రవినాయుడు రాయలచెరువులో పర్యటించి పడవ పోటీల ప్రాక్టీస్ సెషన్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, రాయలచెరువు నీటి సంఘం ఉపాధ్యక్షుడు దేవరాజులు, రాయలచెరువుపేట సర్పంచ్ మురగయ్య, మాజీ సర్పంచ్ మాధవి, నీటి సంఘాల అధ్యక్షులు నరసింహారెడ్డి, ఎంపీడీవో ఇందిరమ్మ, ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

చిత్తూరు అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రేమజంట ఆత్మహత్యకు యత్నించిన ఘటన చిత్తూరు రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చంద్రగిరికి చెందిన గురవయ్య కుమారుడు భరత్ (21), కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన తాయమ్మ కుమార్తె రాజేశ్వరి (19)లు తిరుపతిలోని రెడ్డి అండ్ రెడ్డి కాలనీలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పని చేస్తున్నారు. ఐదునెలలుగా ప్రేమించుకున్న వీరు గురువారం చంద్రగిరిలోని మూలస్థాన ఎల్లమ్మ గుడిలో వివాహం చేసుకున్నారు. భరత్ స్నేహితుడు చిత్తూరులోని రామ్‌నగర్‌కాలనీ విస్డమ్ స్కూల్ సమీపాన నివాసం ఉండగా, సాయంత్రం అక్కడికి చేరుకున్నారు. తర్వాత స్నేహితుడికి ఫోన్ చేయగా అతను స్పందించక పోవడంతో భయపడి తమ వెంట తెచ్చుకున్న రసాయనాన్ని తాగేశారు. స్థానికులు గమనించి, వారిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీకి తీసుకెళ్లారు. పోలీసులు విచారిస్తున్నారు.

పరిశ్రమలు వస్తున్నాయి.. సహకరించండి

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు పలు పరిశ్రమలు వస్తున్నాయని, భూసేకరణకు సహకరించాలని సత్యవేడు మండల రైతులను కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో సత్యవేడు మండలం తొల్లడం, పెద్దఈటిపాకం, ఇరుగళం, చిన్న ఈటిపాకం రైతులతో ఆయన సమావేశమయ్యారు. ఆయా గ్రామాల్లోని సుమారు 55.66 ఎకరాల భూసేకరణకు ఈనెల 15న ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చినట్లు తెలిపారు. అందులో 40 ఎకరాల పట్టా భూమి ఉందని, ఆ మేరకు రైతులతో నష్టపరిహారంపై జేసీ శుభం బన్సల్‌తో కలిసి కలెక్టర్ చర్చించారు. సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి పాల్గొన్నారు.

తిరుమలలో రేపు డయల్ యువర్ ఈవో

తిరుమల, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): టీటీడీ డయల్ యువర్ ఈవో కార్యక్రమం శనివారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తిరుమలలో జరుగనుంది. భక్తులు తమ సందేహాలు, సూచనలు, ఫిర్యాదులపై టీటీడీ ఈవో శ్యామలరావుతో ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడవచ్చు. సంప్రదించాల్సిన ఫోన్ నెంబరు: 0877 2263261.

ఆగివున్న లారీని ఢీకొన్న మినీలారీ

- డ్రైవర్ మృతి



ప్రమాదంలో దెబ్బతిన్న లారీ ముందుభాగం - లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ రాజా

దొరవారిసత్రం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం కుప్పారెడ్డిపాలెం సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి ఆగివున్న లారీని వెనుకవైపు నుంచి మినీలారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తమిళనాడుకు చెందిన మినీలారీ డ్రైవర్ రాజా కరుపాల్యా(27) మృతి చెందాడు. సౌక కొయ్యల లోడుతో వెళ్తున్న లారీ టైరు పంక్చర్ కావడంతో కుప్పారెడ్డిపాలెం సమీపంలో జాతీయ రహదారిపై ఆగింది. బత్తాయి పండ్ల లోడుతో గుజరాత్ నుంచి చెన్నై వెళ్తున్న మినీలారీ బుధవారం అర్ధరాత్రి ఆగివున్న లారీని వెనుకవైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో సౌక కొయ్యలు మినీలారీ క్యాబిన్‌లోకి చొచ్చుకుపోవడంతో డ్రైవర్ రాజా తీవ్రంగా గాయపడ్డారు. హైవే మొబైల్ పోలీస్ సిబ్బంది స్థానికుల సహకారంతో క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ రాజా కరుపాల్యాను బయటకు తీసి 108 వాహనంలో సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గదుల జారీని పర్యవేక్షిస్తున్న అదనపు ఈవో

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుమల, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): తిరుమలలో గదుల జారీ ప్రక్రియను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. సిఫార్సులున్నప్పటికీ తిరుమలలో గదులు కేటాయించే పద్మావతి, ఎంబీసీ34 కార్యాలయాల వద్ద భక్తులు అధిక సమయం నిరీక్షిస్తూ ఇబ్బంది పడుతున్న విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన విషయం తెలిసిందే. వెంకయ్య చౌదరి పద్మావతి విచారణ కార్యాలయానికి వెళ్లి ఏఏ సిఫార్సులపై గదులు కేటాయిస్తున్నారు, ఏ సమయంలో ఎన్ని గదులు భక్తులు పొందుతున్నారు, అవకతవకలు ఏమైనా జరుగుతున్నాయా, భక్తులకు ఎందుకు ఆలస్యం అవుతోంది, ఎక్కడ గదులు బ్లాక్ అవుతున్నాయి వంటి అంశాలను పరిశీలించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా లభ్యతను బట్టి గదులు కేటాయించాలని, వీలైనంతవరకు నిరీక్షణ సమయాన్ని తగ్గించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.

రేణిగుంటలో డెంగ్యూ కేసు నమోదు

రేణిగుంట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి) : రేణిగుంటలో డెంగ్యూ కేసు నమోదైంది. రేణిగుంట పంచాయతీ పరిధిలోని బుగ్గవీధిలో ఓ మహిళకు డెంగ్యూ పాజిటివ్‌గా వైద్యులు నిర్ధారించారు. గురువారం ఆ ప్రాంతంలో చుట్టుపక్కల ఇళ్లల్లో నివాసం ఉంటున్న వారి వద్ద ఏఎన్‌ఎంలు రక్తనమూనాలు సేకరించారు. పంచాయతీ అధికారులు పారిశుధ్య పనులు చేపట్టారు. డెంగ్యూ జ్వరం పట్ల ప్రజలు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఇంటిలోపల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీళ్లు తాగాలని ప్రభుత్వ వైద్య అధికారి డాక్టర్ ప్రకాష్‌రెడ్డి సూచించారు.

టీటీడీ నిధుల వ్యయానికి 'చికిత్స'

- కొన్ని ఆస్పత్రుల నిర్వహణ, నిర్మాణాలకు భారీగా నిధుల కేటాయింపు అవసరమా..
- పరిశీలనకు తాజాగా కమిటీ నియామకం

తిరుమల, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రుల నిర్వహణ, నిర్మాణాల వ్యయంపై టీటీడీ ప్రత్యేక దృష్టి సారించింది. రూ.వేల కోట్ల నిధులను ఆస్పత్రుల పేరుతో మళ్లించడం ఏమేరకు సమంజసమనే దిశగా యోచిస్తోంది. ఇటీవల దీనిపై ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేసింది. టీటీడీ మాజీ ఈవో, పూర్వపు జిల్లా కలెక్టర్, హెల్త్ స్పెషల్ సెక్రటరీగా పనిచేసి రిటైరైన ఐవీ సుబ్బారావు ఆధ్వర్యంలో కమిటీ ఇప్పటికే టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆస్పత్రులను, భవన నిర్మాణాలను పరిశీలించింది. టీటీడీ ఆధ్వర్యంలో స్విమ్స్, ఆయుర్వేద, బర్డ్ వంటి ఆస్పత్రులు నడుస్తున్నాయి. మరోపక్క గత వైసీపీ ప్రభుత్వంలో పద్మావతి చిన్న పిల్లల హృదయాలం ఆస్పత్రి నిర్మాణ పనులనూ ప్రారంభించింది. దీని నిర్మాణానికే దాదాపు రూ.300 కోట్లకుపైగానే కేటాయించింది. స్విమ్స్‌లో బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ విభాగం, మరో భారీ భవన నిర్మాణాలకు రూ.200 కోట్లకుపైగా కేటాయించారు. గత ప్రభుత్వ హయాంలో మరికొన్ని సూపర్ స్పెషాలిటీ సేవలు అందించేందుకు కూడా భారీగా నిధులు కేటాయిస్తూ నిర్ణయాలు తీసుకున్నారు. వాటిన్నిటికీ దాదాపు రూ.వెయ్యి నుంచి రూ.1,200 కోట్ల వరకు అవసరమవుతుంది.

టాటా సంస్థ ఉండగా మళ్లీ కేన్సర్‌కు నిధులా..

వాస్తవానికి క్యాన్సర్ రోగులకోసం ఇప్పటికే టాటా ట్రస్టు వేంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్ రిసెర్చ్, కాంప్రెస్ క్యాన్సర్ ఆస్పత్రి (స్వీకార్) నిర్మించి సేవలు అందిస్తోంది. ఈక్రమంలో మళ్లీ బాలాజీ ఇనిస్టిట్యూట్ అంకాలజీ ఎందుకని భావిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం టీటీడీ ఆదాయం కంటే ఖర్చే అధికంగా ఉంటోందని ప్రస్తుత అధికారులు చెబుతున్నారు. ఈనేపథ్యంలోనే ఆస్పత్రుల నిర్వహణ, నిర్మాణాలకు ఈస్థాయిలో నిధులు అవసరమా అనే కోణంలో విశ్లేషిస్తున్నారు. గత ప్రభుత్వంలోని అధికారులు కమీషన్లకు కక్కుర్తిపడి ఇలాంటి నిర్ణయాలు తీసుకున్నారని భావిస్తున్నారు. స్విమ్స్ నిర్వహణే సక్రమంగా లేనప్పుడు కోట్లాది రూపాయల కేటాయించడం ఎంతమేరకు సబబనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ప్రత్యేక కమిటీ ఈ మొత్తం వ్యవహారంపై నివేదిక ఇచ్చేందుకు కసరత్తు చేస్తోంది.

వైసీపీ కార్పొరేటర్ల కొత్త కూటమి

- ఎన్డీయే స్థానిక నేతలను మెప్పించిన తర్వాతే ఆయా పార్టీల్లోకి
- అప్పటివరకు స్వతంత్రంగానే వ్యవహరిస్తాం
- పలు అంశాలపై సుదీర్ఘ చర్చ




సమావేశమైన డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, వైసీపీ కార్పొరేటర్లు

తిరుపతి, డిసెంబరు26 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని కొందరు వైసీపీ కార్పొరేటర్లు కొత్త కూటమిగా ఏర్పాటవుతున్నారు. ఎన్నికల అనంతరం ఎన్డీయే కూటమిలో చేరేందుకు పలువురు విఫలయత్నం చేసిన విషయం తెలిసిందే. ఇందుకు గల అడ్డంకులను సమీక్షించుకుని, వాటిని అధిగమించి టీడీపీ, జనసేనలో చేరేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. ఈమేరకు గురువారం అందుబాటులో ఉన్న దాదాపు 10 మంది కార్పొరేటర్లు పాయ్‌వైశ్రాయ్ హోటల్లో సమావేశమై చర్చించుకున్నారు. గత వైసీపీ పాలనలో టీడీపీ, జనసేన శ్రేణులను ఇబ్బందిపెట్టని కార్పొరేటర్లను చేర్చుకునేందుకు ఎన్డీయే ప్రభుత్వానికి ఇబ్బందిలేదని, గతంలో తామలా వ్యవహరించలేదు కాబట్టి పార్టీలో చేరేందుకు ఎలాంటి అడ్డంకులు ఉండవని అభిప్రాయపడ్డారు. అయితే ఆయా డివిజన్లలోని స్థానిక నాయకత్వాన్ని కూడా మెప్పించి పార్టీలో చేరేందుకు మార్గం సుగమం చేసుకోవాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. తద్వారా భవిష్యత్తులో ఎలాంటి గందరగోళం లేకుండా ముందుకుపోవచ్చని భావించారు. గత కౌన్సిల్ తీర్మానం మేరకు కార్పొరేటర్లకు నెలలో ఒకసారి శ్రీవారి దర్శనం కల్పించాలని కోరుతూ టీటీడీ చైర్మన్‌ను కలవాలని నిర్ణయం తీసుకున్నారు. ఏదైనా పార్టీలో చేరేవరకు తాము ఎవరికీ అనుకూలంగా ఉండమని, అవిశ్వాసం కూడా పార్టీ నిర్ణయాలమేరకు ఉంటుందని తీర్మానం చేసుకున్నట్టు తెలిసింది. ఈసమావేశంలో డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్లు నరసింహాచారి (25వ డివిజన్), నరేంద్రనాథ్ (38), దూది కుమారి భర్త శివ(33), కుడితి సుబ్రమణ్యం (36), పొన్నాల చంద్ర (28), దొడ్డారెడ్డి మునిశేఖర్ (11), అనిల్ (50వ డివిజన్) సమావేశానికి హాజరైనట్టు తెలిసింది. మరికొంతమంది ఫోన్ ద్వారా సంఘీభావం తెలిపినట్టు సమాచారం.

- అన్నమయ్య విగ్రహం ఘటనలో

నిందితుడి అరెస్టు



తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం అన్నమయ్య సర్కిల్‌లోని అన్నమయ్య విగ్రహానికి శాంతాక్లాజ్ టోపీ పెట్టిన నిందితుడిని ఈస్ట్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఈస్ట్ సీఐ రామకృష్ణ కథనం మేరకు.. అన్నమయ్య విగ్రహానికి టోపీ పెట్టడంతో దుమారం రేగింది. భజరంగదళ్ నాయకులు విగ్రహం వద్ద ఆందోళన చేశారు. ఎంఆర్ పల్లి పరిధిలోని ఉల్లిపట్టెడకు చెందిన ఎస్.విష్ణుప్రతీక్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అన్నమయ్య సర్కిల్ వద్ద లభించిన సీసీ పుటేజీల ఆధారంగా నిందితుడిని గుర్తించారు. ఇతడు మహారాష్ట్రలోని పర్బానీ తాలూకా పెడ్గోన్ గ్రామానికి చెందిన భందుదార్జి జవహర్‌గా గుర్తించారు. 15 రోజుల కిందట తిరుపతికి వచ్చిన ఇతడు.. చిత్తు పేపర్లు ఏరుకుంటూ ప్లాట్‌ఫారాలపై పడుకునేవాడు. ఈనెల 23న శాంతాక్లాజ్ టోపీ దొరకగా అన్నమయ్య విగ్రహంపై ఉంచాడు. ఇతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ చెప్పారు.

పశుగణనను వేగవంతం చేయండి

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పశుగణన ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. గురువారరం కలెక్టరేట్‌లో పశుసంవర్ధకశాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. పాల ఉత్పత్తి పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ ద్వారా పశుగ్రాసం పెంపకం, మినీ గోకుల షెడ్ల నిర్మాణ లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవికుమార్, అధికారులు ఉమామహేశ్వరి పాల్గొన్నారు. ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని ఉద్యానవన శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సాయంత్రం కలెక్టరేట్‌లో ఆయన ఆ శాఖ అధికారులతో సమీక్షించారు.

ఎస్వీయూ స్టోర్స్ ఆరోపణలపై విచారణ ముమ్మరం

తిరుపతి, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలోని కో ఆపరేటివ్ స్టోర్స్ గత వైసీపీ పాలనలో పక్కదారి పట్టింది. దాన్ని రాజకీయ కేంద్రంగా మార్చేసి అక్రమ నియామకాలకు తెరలేపినట్టు వెలుగులోకి వచ్చింది. ఒక్కసారి కూడా సర్వసభ్య సమావేశం నిర్వహించకుండా వైసీపీ తరఫున చక్రంతిప్పే ఒక ప్రొఫెసర్ రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చేశారన్న విమర్శలు వచ్చాయి. అతని అనుయాయులను ఉద్యోగులుగా నియమించినట్టు తెలిసింది. ఈ క్రమంలో కొంతమంది ఉద్యోగులు దౌర్జన్యంగా స్టోర్ వ్యవహారాల్లో కీలకంగా మారారు. కూటమి ప్రభుత్వం వచ్చాక విచారణ జరిపించాలని విద్యార్థి సంఘాలు, తెలుగు యువత సంయుక్తంగా కోఆపరేటివ్ స్టోర్స్ జిల్లా అధికారికి మూడు నెలల ముందు కోరాయి. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టడంతో పలు అవినీతి, అక్రమాలు వెలుగులోకి వస్తున్నట్టు తెలుస్తోంది. గురువారం కూడా ఎస్వీయూ స్టోర్‌లో విచారణ చేపట్టారు. ఫిర్యాదు చేసిన తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద గౌడ్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆర్కే నాయుడు, టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి మైలారి అశోక్‌లను శుక్రవారం విచారించి, వారి వద్ద ఉన్న ఆధారాలను అధికారులు సేకరించనున్నారు.



ఆలయం ముందు జస్టిస్ టీసీడీ శేఖర్

శ్రీవారి సేవలో న్యాయమూర్తులు

తిరుమల, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీసీడీ శేఖర్ గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ, టేబుల్‌టెన్నిస్ ప్లేయర్ నైనా జైస్వాల్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.





జస్టిస్ దుప్పల వెంకటరమణ - నైనా జైస్వాల్

రెవెన్యూ సదస్సులకు 730 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం 48 రెవెన్యూ సదస్సులు నిర్వహించగా 730 అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడించారు. అందులో ఇళ్ల స్థలాల కోసం 114, అసైన్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ల్యాండ్‌పై 45, కుల ధ్రువీకరణ కోసం 1, రీసర్వే 29, ల్యాండ్ గ్రాబింగ్ 11, ఆర్‌వోఆర్ 345, ఇతర విషయాలకు 129 ఉన్నాయని వివరించారు. 58 అర్జీలను అప్పటికప్పుడే పరిష్కరించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 12,306 అర్జీలు వచ్చాయన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఐదుగురు డీబార్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ 1, 3, 5 సెమిస్టర్ పరీక్షల్లో ఐదుగురు విద్యార్థులు డీబార్ అయ్యారు. పరీక్షలను పర్యవేక్షిస్తున్న హైపవర్ కమిటీ మదనపల్లె ప్రాంతంలోని పరీక్షా కేంద్రాల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఐదుగురిని గుర్తించి, డీబార్ చేసినట్టు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

మహిళలపై దాడిచేస్తే కఠినంగా శిక్షించాలి

- మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్



తిరుమల, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): మహిళలపై దాడులు చేస్తున్నవారిని కఠినంగా శిక్షించాలని మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ అన్నారు. కఠినమైన శిక్షలు అమలుచేస్తేనే నేరాలు చేయాలనుకునేవారిలో భయం కలుగుతుందని అభిప్రాయపడ్డారు. అప్పుడే ఆడవారికి నిజమైన రక్షణ కల్పించవచ్చన్నారు. తిరుమల శ్రీవారిని గురువారం దర్శించుకున్న ఆయన.. ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. మహారాష్ట్రలో ఎన్నికలు ప్రశాంతంగా, న్యాయంగా జరిగిన క్రమంలో శ్రీవారిని దర్శించుకునేందుకు తిరుమలకు వచ్చినట్టు తెలిపారు. స్వామిని దర్శించుకోమని ఎవరు ఎలాంటి ప్రచారం చేయకపోయినప్పటికీ రోజురోజుకు భక్తుల సంఖ్య పెరుగుతుండటం శ్రీవారి మహిమ అన్నారు.

పుత్తూరు వార్తలు

రేపు మెగా జాబ్ మేళా

పుత్తూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం 28వ తేదీ ఉదయం 10 గంటలకు మెగా జాబ్‌మేళా జరుగుతుందని కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ వీరయ్య తెలిపారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్‌మేళాలో తొమ్మిది కంపెనీలు పాల్గొంటాయని వెల్లడించారు. పదో తరగతి నుంచి ఇంజనీరింగ్ చదివిన వారు అర్హులని వివరించారు. ఆసక్తిగల వారు తమ సరిఫికెట్లు, ఆధార్, రెండు ఫొటోలతో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు బాబురావు, కిశోర్‌లను సంప్రదించాలని కోరారు.

ప్రసన్న వెంకన్న సేవలో పీవీ. సింధు దంపతులు



వడమాలపేట, డిసెంబర్ 26(ఆంధ్రజ్యోతి): ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ.సింధు, వెంకట దత్తసాయి దంపతులు ప్రసన్న వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. గురువారం వారు ఆలయానికి విచ్చే శారు. దర్శనానంతరం అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ సీనియర్ అసిస్టెంట్ బాలాజీ వారికి దర్శన ఏర్పాట్లు చేశారు.

రైల్వే గేటు మూసివేతతో వాహనదారుల ఇక్కట్లు



పుత్తూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నారాయణవనం రైల్వేగేటు మూడు రోజులుగా మూసివేశారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం రాత్రి ఓ లారీ గేటును గుద్దడంతో గేటు బాగా దెబ్బతింది. మరమ్మతుల తర్వాత గేటును భూమిలో సిమెంటుతో పాతి పెట్టారు. గత మూడు రోజులుగా వర్షాలు పడడంతో సిమెంటు గట్టి పడడం లేదు. దీంతో గేటును తెరవకుండా నిరవధికంగా మూసి ఉంచారు. ఫలితంగా సత్యవేడు, నాగలాపురం వైపు వెళ్లే వాహనాలు కిలోమీటరు దూరంలో వున్న మరో రైల్వే గేటును చుట్టుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోంది. మరోపక్క ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు వంటి వాహనాలు ఎంబీ రోడ్డులోని అండర్‌బ్రిడ్జి మీదుగా పట్టణంలోకి రాకపోకలు సాగిస్తుండడంతో డీఎస్పీ కార్యాలయం ముందు ట్రాఫిక్ రద్దీ నెలకొంటోంది.

పెండింగ్ బకాయిల ఊసేలేదు

- 2025-26 బడ్జెట్ కేటాయింపులు
- అభివృద్ధి పనుల ఆమోదం కోసం అజెండా సిద్ధం
- నేడు పుత్తూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



పుత్తూరు అర్బన్, డిసెంబర్ 26(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపల్ పరిధిలో రూ.కోట్లలో పేరుకుపోయిన మొండి బకాయిల వసూలు విషయమై కౌన్సిల్ అజెండాలో ఊసేలేదు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్, డీవీఎం షాపులు, మటన్ షాపుల అద్దె బకాయిలు రూ.34.25 లక్షలు ఉండగా, జంతు వధశాల, ప్రైవేటు బస్టాండ్, దినసరి మార్కెట్ లీజు చెల్లింపుల బకాయి కూడా రూ.48.10 లక్షలు వసూలు కావాల్సి ఉంది. గత కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం మేరకు సదరు బకాయిదారుపై కోర్టును ఆశ్రయించేలా నిర్ణయించారు. ఆ తరువాత బకాయిదారులకు కౌన్సిల్ మెజారిటీ సభ్యుల ఆమోదం మేరకు గడువును నిర్దేశించారు. అయినా బకాయిదారుల నుంచి ఎటువంటి స్పందన కనిపించడం లేదు. శుక్రవారం నిర్వహించే కౌన్సిల్ సమావేశంలో చర్చకు రానున్న అజెండాలోనూ బకాయిల ఊసే లేకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. 2025-26 బడ్జెట్, అభివృద్ధి పనులకు నిర్వహించిన టెండర్ల ఆమోదానికి అత్యవసరంగా కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేశారు. 2024-25 ప్రారంభ నిల్వ రూ.30.50 లక్షలు కాగా, ఆదాయం రూ.53.61 కోట్లు రాగా, రూ.47.99 కోట్లు ఖర్చుగా అధికారులు చూపారు. కాగా రూ.5.92 కోట్లు ముగింపు నిల్వగా పేర్కొన్నారు. 2025-26 ఏడాదికి గాను రూ.51.68 కోట్లుగా, ఖర్చు 44.96 కోట్లుగా, రూ.6.68 కోట్లు ముగింపు నిల్వగా అంచనా సిద్ధం చేశారు. రోడ్లు, పార్కులు, లైటింగ్ నిర్వహణ, విస్తరణ, బావులు, బోర్ల పనులు, డ్రైయిన్లు, కల్వర్టులు తదితర అభివృద్ధి పనులకు రూ.1.56 కోట్ల అంచనాలు రూపొందించారు. శుక్రవారం జరిగే కౌన్సిల్ సమావేశంలో మొండి బకాయిల వసూలు విషయమై టీడీపీ కౌన్సిలర్లు ప్రశ్నించనున్నట్లు తెలుస్తోంది.

శ్రామికుల పక్షాన నిలిచేది సీపీఐ


సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

పుత్తూరు టౌన్, డిసెంబర్ 26(ఆంధ్రజ్యోతి): పేదలు, శ్రామికుల పక్షాన నిలిచేది సీపీఐ అని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి మహేష్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఎంబీ రోడ్డు నందు సీపీఐ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా సీపీఐ జెండాను సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవి, మణి, రమేష్, రమణ, కైలాసం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన డీపీఐఐటీ సెక్రటరీ

శ్రీసిటీ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) కార్యదర్శి అమర్‌దీప్ సింగ్ భాటియా గురువారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ సతీష్ కామత్ ఆయనకు స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రగతిని, ప్రత్యేకతలను వివరించారు. డైకిన్ ఏసీ తయారీ పరిశ్రమలో తయారీ కార్యకలాపాలను పరిశీలించారు. శ్రీసిటీలో ఉన్న పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, వ్యాపార అనుకూలత వాతావరణాన్ని అమర్‌దీప్ సింగ్ ప్రశంసించారు. ఆత్మనిర్భర్ భారత్‌కు శ్రీసిటీ ఒక చక్కని ఉదాహరణగా అభివర్ణించారు. అమర్‌దీప్ సింగ్ పర్యటన తమకెంతో ముఖ్యమైనదంటూ శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



అమర్‌దీప్ సింగ్‌కు స్వాగతం పలుకుతున్న శ్రీసిటీ ప్రతినిధులు

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూళ్లూరుపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట చెంగాలమ్మ ఆలయ సమీపంలో ఉన్న సబ్‌స్టేషన్ పరిధిలోని తపాలా కార్యాలయం నుంచి పీర్లచావడి పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఏ శేఖర్ తెలిపారు. అదే విధంగా మధ్నాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సాయినగర్, చేపల మార్కెట్, పరమేశ్వరి నగర్, గాండ్లవీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలన్నారు.

అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట


స్వర్ణముఖినదిలోకి ట్రాక్టర్లు వెళ్లకుండా దారులను మూసివేస్తున్న వీఆర్వో మురళి, ఇరిగేషన్ ఏఈఈ శ్రీనివాసులు

నాయుడుపేట టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యప్పరెడ్డిపాళెం, మూర్తిరెడ్డిపాళెం స్వర్ణముఖినది నుంచి ఇసుకను అక్రమ రవాణా చేయకుండా అధికారులు చర్యలు చేపట్టారు. అక్రమంగా ఇసుక రవాణా జరుగుతోందని సమాచారం అందడంతో గురువారం ఇరిగేషన్ ఏఈఈ శ్రీనివాసులు, వీఆర్వో మురళి స్వర్ణముఖినది నుంచి ట్రాక్టర్లు వెళ్లకుండా ఎక్స్‌కవేటర్ సహాయంతో దారులను మూసివేయించారు.

రొయ్యలకు 'వైట్‌స్పాట్'

- లక్షల్లో చనిపోతున్న పిల్లలు
- లబోదిబోమంటున్న ఆక్వా రైతులు


వైట్‌స్పాట్‌తో చనిపోయిన రొయ్యలు - వ్యాధి సోకిన రొయ్యలు

కోట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వరకు నష్టాలు చవిచూస్తూ వచ్చిన రొయ్య రైతులకు మళ్లీ చేదు అనుభవం ఎదురవుతోంది. దశాబ్దకాలంగా వెనామి రొయ్యలతో లాభాలు గడిస్తూ చివరిదశలో నష్టాలు రావడంతో మళ్లీ ఆక్వా రైతులు టైగర్ రొయ్యసాగుపై దృష్టి పెట్టారు. మూడేళ్లుగా టైగర్ రొయ్యసాగు చేస్తూ వస్తున్నారు. అయితే టైగర్‌కు కూడా వైట్‌స్పాట్ వ్యాధి సోకడంతో మూలిగేనక్కపై తాడికాయ పడ్డట్టుగా ఆక్వా రైతులు నష్టాల ఊబిలోకి వెళ్లిపోతున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో సముద్రతీర ప్రాంతాలైన కోట, చిల్లకూరు, వాకాడు, చిట్టమూరు మండలాలు రొయ్యల సాగుకు ప్రసిద్ధి. ప్రస్తుతం కొన్ని మండలాల రైతులు టైగర్ సాగుచేస్తుండగా కొందరు వెనామి సాగు చేస్తున్నారు. గత 20రోజుల నుంచి బంగాళాఖాతంలో అల్పపీడనాల కారణంగా ఆకాశం మేఘావృతం కావడం, విపరీతంగా మంచు కురవడంతో టైగర్, వెనామి రొయ్యలకు వైట్‌స్పాట్ సోకుతోంది. మంచు 18నుంచి 20 డిగ్రీల వరకు పడిపోవడంతో నీటి సాంద్రత తగ్గిపోయి రొయ్యలకు శ్వాసకోశ సంబంధితమైన వైట్‌స్పాట్ వ్యాధి సోకుతోంది. ఈ వ్యాధి సోకినప్పటి నుంచి రొయ్య పిల్లలు ఆహారం తినడం మానేసి రోజురోజుకూ బలహీనపడిపోతాయి. మొప్పలపై నల్లని, తెల్లని మచ్చలు ఏర్పడి చనిపోయి గుంతల్లోని ఒడ్డుకు చేరుతాయి. కోట మండలంలోని గోవిందపల్లి, గోవిందపల్లిపాళెం, కొత్తపట్నం, వాకాడు మండలంలోని దుగరాజపట్నం గ్రామాల్లో సాగవుతున్న రొయ్యలకు వైట్‌స్పాట్ సోకి లక్షల్లో పిల్లలు చనిపోతున్నాయి. రొయ్య పిల్ల 18 రోజుల నుంచి 60 కౌంట్ వరకు ఈ వ్యాధి సోకుతుంది. ఎన్ని మందులు వాడినప్పటికీ వాతావరణంలో మార్పుల వల్ల వ్యాధి తగ్గకపోవడంతో ఆక్వా రైతులు లబోదిబోమంటున్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి

వెంకటగిరి టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దుకాణాల యజమానుల తమ షాపుల వద్ద సీసీ కెమారాలు విధిగా ఏర్పాటు చేసుకోవాలని సీఐ రమణ అన్నారు. గురువారం స్థానిక పింజల వీరయ్య కల్యాణ మండపంలో దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పాఠశాలలు, అపార్ట్‌మెంట్లు, బ్యాంకులు, హోటళ్ల నిర్వాహకులు తప్పనిసరిగా సీసీ కెమారాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. భద్రతా ఏర్పాట్ల దృష్ట్యా ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐలు సుబ్బరావు, భవాని, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను అర్హులకు ఇవ్వండి


తహసీల్దార్ ద్వారకనాథరెడికి వినతిపత్రం అందిస్తున్న రైతులు, పక్కన సంచి కృష్ణయ్య, ప్రసాద్‌నాయుడు, సత్యంరాజు, మురళీనాయుడు

పెళ్లకూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రోసనూరు గ్రామ రెవెన్యూలో పరిధిలోని సర్వే నెంబర్ 1లో పేదలకు పంచిన 40 ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయ్యాయని, వాటిని అర్హులకు ఇవ్వాలని తహసీల్దార్ ద్వారనాథరెడ్డిని ఆ గ్రామస్తులు కోరారు. గురువారం మండలంలోని రోసనూరులో రెవెన్యూ సదస్సు జరిగింది. భూ ఆక్రమణలుపై గ్రామస్తులు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను తొలిగించాలని నాలుగు, పట్టాదారు పాసుపుస్తకం కోసం రెండు, సర్వే కోసం రెండు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ సంతోషీబాయి, మండల సర్వేయర్ పూజిత, వీఆర్వో వంశీకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖి ఆనకట్టు సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, నాయకులు దొమ్మరాజు సత్యనారాయణరాజు, మురళీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేయండి


మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

గూడూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): సమ్మెకాలపు ఒప్పందాలను వెంటనే అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని గత ఏడాది 17 రోజుల సమ్మె నిర్వహించడం జరిగిందన్నారు. ప్రభుత్వం అప్పట్లో కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు నెరవేర్చలేదన్నారు. సాధారణ, ప్రమాదంలో మరణించిన మున్సిపల్ కార్మికులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, మృతుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. అలాగే రిటైర్ మెంట్ బెనిఫిట్స్, ఇంజనీరింగ్ కార్మికులకు జీతాల పెంపు తదితర డిమాండ్‌లను పరిష్కరించడంతో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య దోరణిని నిరసిస్తూ గతేడాది సమ్మె చేపట్టామని గుర్తు చేశారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, పెంచలప్రసాద్, జోగి శివకుమార్, సురేష్, బీవీరమణయ్య, మణి, శంకరయ్య, మురళి, ప్రభావతి, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన భూమి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి


తహసీల్దారుకు ఫిర్యాదు అందజేస్తున్న గోవిందపల్లి గ్రామస్తులు

కోట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్మశాన భూములను కొంతమంది భూస్వాములు ఆక్రమిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలంటూ మండల పరిధిలోని గోవిందపల్లి గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. గురువారం పంచాయతీ కేంద్రమైన కొత్తపట్నంలో తహసీల్దారు జయజయరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. పంచాయతీలోని పలు గ్రామాలకు రైతులు భూ సమస్యలపై అర్జీలు అందజేశారు. గోవిందపల్లిలో కొంతమంది రైతులు శ్మశాన భూములపై తమ పొలాల్లో కలుపుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆ గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. అధికారులు తక్షణం స్పందించి శ్మశాన భూములకు హద్దులు ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. కొన్ని సమస్యలను రెవెన్యూ సిబ్బందితో అక్కడిక్కడే పరిష్కరించగా కొన్ని అర్జీలను వివిధ శాఖల అధికారులకు పంపారు. ఈ కార్యక్రమంలో సర్పంచు తిరుపాలయ్య, సర్వేయర్ గోపీరెడ్డి, వీఆర్వో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం సభను విజయవంతం చేయండి


ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

గూడూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని వీహెచ్‌పీ పట్టణాధ్యక్షుడు మురళీరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలో హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలాయాల్లో అన్యమతస్థులను తొలగించాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కూడా హిందువులే ఉండాలన్నారు. దేవాలయ ట్రస్ట్ బోర్డుల్లో రాజకీయ ప్రమేయంలేని హిందూ భక్తులను మాత్రమే సభ్యులుగా నియమించాలన్నారు. ఆలయాల మీద వచ్చే ఆదాయాన్ని హిందూధర్మ ప్రచారానికి మాత్రమే వినియోగించాలన్నారు. హైందవ శంఖారావం సభలో హిందూవులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటరమణయ్య, రవిచంద్ర, రామయ్య, సత్యానందస్వామి, సనత్‌కుమార్‌రెడ్డి, ఆరికట్ల బాలకృష్ణమనాయుడు, దయాకర్, గాలి ప్రకాష్‌నాయుడు, మనోజ్, మల్లికార్జున, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడులో రోడ్డు ప్రమాదం పుల్లూరు యువకుడి మృతి

తిరుత్తణి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని తిరువళ్లూర్ జిల్లా పల్లిపట్టు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరుపతి జిల్లా యువకుడు మృతిచెందగా, మరొకరికి గాయాలయ్యాయి. పెళ్లకూరు మండలం పుల్లూరుకు చెందిన సురేష్ (34), అదే గ్రామానికి చెందిన వినోద్‌తో కలసి ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. పల్లిపట్టు సమీపంలోని నగరి రహదారిలో బైక్‌ను టిప్పర్ లారీ ఢీకొంది. ఈ ఘటనలో సురేష్ మృతిచెందగా, వినోద్‌కు గాయాలయ్యాయి. పల్లిపట్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి పెట్టండి

ఓజిలి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తరచూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్య సమస్య ఉందని, దీనిపై ఆయా పంచాయతీ కార్యదర్శులు దృష్టి పెట్టాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఇళ్లకు సమీపంలో పేడ దిబ్బలు, ఇతర వ్యర్థాలు ఉండకుండా చూడాలన్నారు. అవసరం ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లాలని సూచించారు.

సీపీఐ శత వార్షికోత్సవం

తడ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీపీఐ 100వ వార్షికోత్సవ వేడుకలు తడలో నిర్వహించారు. గురువారం స్థానిక బజారుకూడలిలో సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. చాక్లెట్లను పంచిపెట్టారు. దేశంలో పార్టీ ఏర్పాటై 99 యేళ్లు పూర్తిచేసుకొని 100వ సంవత్సరంలోకి అడుగుపెట్టిందని ఆయన అన్నారు. కార్మిక ప్రత్యేక పీడిత అట్టడుగువర్గాల అభ్యున్నతికి పోరాటం చేసిందని కోనియాడారు. ప్రభుత్వాలు అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కుమార్, నాయకులు వెంకటేష్, చల్లయ్య, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కమ్మవారిపాళెంలో క్రిస్మస్ వేడుకలు


చర్చి వద్ద చిన్నారులు రూపొందించిన పశువుల పాక

చిల్లకూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపాళెంలో ఉన్న లూథరన్ చర్చిలో గురువారం క్రిస్మస్ వేడుకలు జరిగాయి. గ్రామంలో ఎక్కువ మంది బిషప్‌లు, ఫాస్టర్లు ఉండడంతో వీరంతా 25న ఇతర ప్రాంతాల్లోని చర్చిలకు వెళతారు. దీంతో కమ్మవారిపాళెం గ్రామంలోని ఏటా డిసెంబరు 26న క్రిస్మస్ వేడకలు జరుపుకుంటారు.

నేటి పోరుబాటను జయప్రదం చేయండి

వెంకటగిరి టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపును ఖండిస్తూ సబ్‌స్టేషన్ వద్ద వైసీపీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్న పోరుబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి పిలుపునిచ్చారు.

మున్సిపల్ సిబ్బందికి వేతన బకాయిలు చెల్లించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

వెంకటగిరి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ సిబ్బందికి వేతన బకాయిలు చెల్లించడంతో పాటు ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని, డ్రైవర్లకు జీవో నెంబరు 36 ప్రకారం రూ.24వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలల అవుతున్నా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. ఇప్పటికైనా హామీలను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు.

చేపల వలలో చిక్కుకుని కొండచిలువ మృతి

చిల్లకూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చేపల వలలో చిక్కుకుని కొండచిలువ మృతి చెందిన ఘటన చిల్లకూరు మండలంలోని బల్లవోలు గ్రామానికి చెందిన కొందరు సమీపంలోని సౌనకాలువలో చేపల వల వేశారు. వలను బయటకు తీయగా కొండచిలువ ఉండడంతో భయాందోళనకు గురయ్యారు. అయితే పాము మృతి చెందివుండడంతో ఊపిరి పీల్చుకున్నారు.

పేదలకు దుస్తులు, ఆహార పొట్లాల పంపిణీ


పేదలకు దుస్తులు, ఆహారపొట్లాలు అందజేస్తున్న ప్రగతిసేవాసంస్థ సభ్యులు

గూడూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రగతిసేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం మంజుల, శ్రీవిద్య దాతృత్వంతో పేదలకు దుస్తులు, ఆహారపొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, ప్రభాకర్, పెంచలయ్య, నాగరాజు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు

కోట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలో గురువారం టీడీపీ సభ్యత్వ నమోదు ముమ్మరంగా సాగింది. టీడీపీ జిల్లా కార్యదర్శి తూపిలి రాధాకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బజారుసెంటర్, గోపాల్‌రెడ్డి విగ్రహం సెంటర్, సారంగంవారివీధిలో టీడీపీ సభ్యత్వ సౌకర్యాలను వివరిస్తూ పలువురికి సభ్యత్వం నమోదు చేయించారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి


క్రీడారులతో టెన్నికాయిట్ అసోసియేషన్ సభ్యులు

గూడూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ అన్నారు. గురువారం స్థానిక డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ టెన్నికాయిట్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం పెరిగి ఆరోగ్యంగా ఉండడంతో పాటు పట్టుదల, ఏకాగ్రత పెరుగుతుందన్నారు. జిల్లాలోని జూనియర్ కళాశాలలకు చెందిన 40మంది విద్యార్థులు ఎంపిక పోటీల్లో పాల్గొనగా జూనియర్ బాలికల, బాలుర జిల్లా జట్ల ఎంపిక చేశారు. వీరు జనవరి 11, 12 తేదీల్లో శ్రీకాకుళం జిల్లా పలాసలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హనుమంతరావు, కోటేశ్వరరావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ స్వర్గధామానికి రూ.50వేల విరాళం


స్వర్గధామం నిర్వాహకులకు విరాళం అందజేస్తున్న గోపాలరెడ్డి

నాయుడుపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖినది పరివాహక ప్రాంతంలోని హిందూ శ్మశాన వాటిక స్వర్గధామం అభివృద్ధికి టీడీపీ నాయకుడు, సహకార సంఘ మాజీ అధ్యక్షుడు అత్తివరం గోపాల్‌రెడ్డి రూ.50వేలు విరాళంగా గురువారం అందజేశారు. స్వర్గధామం నిర్వాహకులు ఉదయశంకర్, కృష్ణారావుకు నగదు అందజేశారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

కోట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్, కోట, తుమ్మానాయుడుపాళెం గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయాల్లో బాబా విగ్రహాలకు పలు అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. భక్తులకు అన్నదానం చేశారు.

వేదోక్తంగా మనోన్మణి ఉత్సవం



శ్రీకాళహస్తి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాల యంలో ధనుర్మాసం పురస్కరించుకుని గురువారం వేదోక్తంగా మనోన్మణి(గొబ్బెమ్మ) ఉత్సవం నిర్వహించారు. మొదట ఆలయ అలంకార మండపంలో గొబ్బిదేవతకు పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనం తరం విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారిని చప్పరం అధిష్టించి పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని కర్పూర నీరాజనాలు సమర్పించారు.

రైతుల సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు, నాయకులు

కేవీబీపురం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రైతులు తమ భూముల సమస్యలను పరిష్కరించుకోవడానికి రెవెన్యూ సదస్సులు ఒక చక్కని మార్గమని వాటిని సద్వినియోగం చేసు కోవాలని తహసీల్దారు మునిరత్నంరెడ్డి చెప్పారు. గురువారం మండలంలోని రాయపేడు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 42 వినతిపత్రాలు అందాయి. టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజుల నాయుడు, పార్లమెంటు రైతు అధ్యక్షుడు గోపీనాథరెడ్డి, సర్పంచ్ బాలాజీ, మాజీ ఎంపీపీ మణి, రైతులు, రెవెన్యూ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విమర్శలకు తావులేకుండా ఆడిటింగ్ నిర్వహించాలి



కేవీబీపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విమర్శలకు తావు లేకుండా ఉపాధి పనుల ఆడిటింగ్‌ను నిర్వహించాలని డీఆర్పీలు, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎంపీడీవో రాధారాణి సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొలతల్లో, పనుల్లో, కూలీ చెల్లింపుల్లో జరిగినది జరిగినట్లు నివేదికలు సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో కుమారస్వామి, సీఆర్పీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉపాధిలో అవకతవకలపై స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కేవీబీపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో అవకతవకలు జరగకుండా చూసుకుంటామని ఎంపీడీవో రాధారాణి స్పష్టంచేశారు. 'ఉపాధిలో అవకతవకలు' అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన కథనంపై ఎంపీడీవో రాధారాణి స్పందించారు. గతంలో జరిగిన వాటిపై నివేదిక తయారు చేసి అధికారులకు పంపుతామని చెప్పారు.

వైసీపీ నేతకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

శ్రీకాళహస్తి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకులు ఆమాస చంద్రశేఖర్‌రెడ్డి తండ్రి మునిరెడ్డి ఇటీవల మరణించారు. ఆయన కర్మక్రియలను గురువారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ప్రజాపోరాటాలకు వందేళ్లు



మాట్లాడుతున్న చిన్నిరాజ్

వరదయ్యపాళెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజాపోరాటలు, త్యాగాలకు సీపీఐ మారు పేరని ఆ పార్టీ సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి ఆంబాకం చిన్నిరాజ్ అన్నారు. సీపీఐ వందేళ్ల పోరాటం సందర్భంగా వరదయ్యపాళెంలో గురువారం ఆ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిద్ధులయ్య, చంద్రశేఖర్, బాలగురునాథం, చంద్ర, మురళి, నాగార్జున, పోలయ్య కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



అధికారులకు వినతులు అందజేస్తున్న నాయకులు, ప్రజలు

వరదయ్యపాళెం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు రాజశేఖర్ తెలిపారు. మండలంలోని అంబూరులో రెవెన్యూసదస్సు నిర్వహించారు. అంబూరు ఎస్టీకాలనీలో నివసిస్తున్న వారికి ఇంటిస్థలాలు ఇవ్వాలని స్థానికులు వినతిపత్రం అందించారు. గత ప్రభుత్వం సర్వే నెంబరు 3460/5బిలో 20 కుటుంబాల వారికి ఇంటిస్థలాలు కేటాయించిందని అయితే ఓ రెవెన్యూ అధికారే వాటిని ఆక్రమించారని ఆరోపించారు. ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకుని పేదలకు ఇవ్వా లన్నారు. అనంతరం పలు సమస్యలపై ప్రజలు వినతులు అందజేశారు. టీడీపీ నాయకుడు ఆణిముత్యం నందకిషోర్‌రెడ్డి, మరదవాడ సర్పంచ్ లైలమ్మ, కుమార్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకో వాలని తహసీల్దారు మధుసూదన్‌రావు తెలిపారు. మండలంలోని రౌతు సూరమాలలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలువురు రైతులు, ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందజేశారు. వీటిని నిర్ణీత సమయంలోపు పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. ● శ్రీకాళహస్తి మండలం అప్పలాయగుంటలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దారు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో ఎంజీఎం విద్యార్థిని ప్రతిభ



ప్రియదర్శినిని అభినందిస్తున్న గుడ్లూరు ఐశ్వర్య

శ్రీకాళహస్తి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంజీఎంలో ప్రీప్రైమరి స్టూడెంట్ ప్రియదర్శిని కరాటేలో ప్రతిభ చూపింది. చెన్నైలోని పెరుంబూరులో మెమోరియల్ నేషన్ కరాటే చాంపియన్‌షిప్-2024 పోటీలను ఈ నెల 22న నిర్వహించారు. అందులో ప్రియదర్శిని సత్తా చాటి మూడవ స్థానం దక్కించుకుంది. ఈ నేపథ్యంలో గురువారం ఎంజీఎం పాఠశాలలో డైరెక్టర్ గుడ్లూరు ఐశ్వర్య ఆ విద్యార్థినిని అభినందించారు. విద్యార్థిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ వందేళ్ల వేడుకలు



జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గురువారం సీపీఐ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆయా కార్యాలయాల వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. ప్రజలకు సీపీఐ చేస్తున్నపోరాటాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు జనమాల గురవయ్య, గోపి, మించల శివకుమార్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే ఆదిమూలం మండల పర్యటన

వరదయ్యపాళెం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం మండలంలో శుక్రవారం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పర్యటించనున్నారు. 11 గంటలకు సంతవేలూరు ఎస్సీ హాస్టల్‌ను, 11.30గంటలకు వరదయ్యపాళెం ఎస్సీ హాస్టల్‌ను పరిశీలిస్తారు. రెవెన్యూ సదస్సులో పాల్గొనున్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

రేణిగుంట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి) : పిల్లపాళెం స్వర్ణముఖి ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గాజులమండ్యం పోలీసులు గురువారం సీజ్ చేశారు. స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేశారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగికి ఎమ్మెల్యే నివాళి

పిచ్చాటూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విశ్రాంత డ్రైవర్ ముని రత్నంనాయుడు గురు వారం వేకువజామున గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదిమూలం, క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి తదితరులు ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

హుండీలో నగదు చోరీ

పిచ్చాటూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని తులసికృష్ణాపురం వినాయక స్వామి ఆలయంలోని హుండీని బుధవారం రాత్రి దుండగులు పగులగొట్టి అందులోని నగదును దోచుకెళ్లారు. ఆలయ పూజారి సుబ్రహ్మణ్యం ఉదయం గుర్తించారు.

రెవెన్యూ సదస్సులతో భూముల సమస్యలకు చెక్



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

పిచ్చాటూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): చుక్కల భూములు, నోషన్ ఖాతాల జాబితాలకు వెళ్లిన భూములకు సైతం రెవెన్యూ సదస్సులతో విముక్తి కలుగుతుందని తహసీల్దార్ రమేష్‌బాబు తెలిపారు. గురువారం మండలంలోని గోవర్ధనగిరి గ్రామ సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సు జరిగింది. పలువురు రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ సుధాకర్, సర్పంచ్ సతీష్‌నాయుడు పాల్గొన్నారు.

సబ్ ఇంజనీర్లకు సన్మానం



పిచ్చాటూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరులో గురువారం నూతన విద్యుత్ సబ్ ఇంజనీర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజ్‌కిరణ్‌ను, అలాగే ఇక్కడ సబ్ ఇంజనీర్‌గా పనిచేస్తూ బదిలీపై వెళ్లిన రవిలను ఇన్‌చార్జి ఏఈ ప్రకాష్ సహ ఉద్యోగులతో కలసి ఘనంగా సన్మానించారు.

సేంద్రియ వ్యర్థాలతో బయోగ్యాస్ ఉత్పత్తి

శ్రీకాళహస్తి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి సమీపంలోని ఎలక్ట్రోస్టీల్ కాస్టింగ్ పరిశ్రమ ఆధ్వర్యంలో బయోగ్యాస్ ప్లాంట్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతిరోజూ 500కిలోల సేంద్రియ వ్యర్థాలను ఈ ప్లాంట్ ద్వారా ప్రాసెస్ చేయవచ్చన్నారు. 18 క్యూబిక్ మీటర్ల పునరుత్పాదక బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో ఎస్‌ఎన్ గోస్వామి తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బాధ్యతల స్వీకరణ



శ్రీకాళహస్తి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సుధాకర్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన చంద్రగిరి నుంచి పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఈయనకు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రవి, గోపాల్, కందాటి విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల భూములను రక్షించండి



భూములను రక్షించాలని వినతి పత్రం ఇస్తున్న నాయకులు

సత్యవేడు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణదారుల చెరలో ఉన్న దేవదాయ భూ ములను రక్షించి, ఆలయాలను కాపాడాలని రెవెన్యూ అధికారులకు గ్రామస్తులు వినతి పత్రం అందించారు. సత్యవేడు పంచాయతీ కార్యాల యం ఆవరణలో తహసీల్దార్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో పలువురు వివిధ సమస్యలపై అర్జీలను సమర్పించారు. ప్రధానంగా పట్టణంలోని వినాయకస్వామి ఆలయం, వేణుగోపాల స్వామి ఆలయం, అచలమఠం, కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం, లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, మాతంగేశ్వరస్వామి ఆలయాల భూములు చాలా వరకు అన్యాక్రాంతం అయ్యాయని వివరించారు. వాటిని రక్షించి ఆలయాల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన సుమారు 13 ఎకరాల మాన్యం భూములను గుర్తించి, దేవదాయ శాఖ అప్పగించాలని మండల గ్రూప్‌ఆఫ్ టెంపుల్ ఈవో లత తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించడం గమనార్హం. శివాలయానికి వెళ్లే దారిలో ఉన్న శ్మశాన వాటిక భూములు పూర్తిగా ఆక్రమణకు గురై ఉన్నాయని, వాటిని రక్షించాలని స్థానిక టీడీపీ, బీజేపీ నేతలు వినతి పత్రం అందించారు. కోర్టులో వివాదంలో ఉన్న ఇంటి స్థలంలో నిర్మాణానికి పంచాయతీ అధికారులు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని మాజీ ఎంపీటీసీ బండారు మోహన్‌బాబు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ రూపవాణి, సెక్రటరీ రవికుమార్, మాజీ ఎంపీపీ మస్తాన్, టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, నాయకులు పరమ శివం, షణ్ముగం, వెంకటేశ్వర్లు, మోహన్‌బాబు, శివానందం తదితరులు పాల్గొన్నారు.

తిరుచ్చి వాహనంపై ఊరేగిన కల్యాణ వెంకన్న



నారాయణవనం, డిసెంబర్ 26(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలో కొలువైన పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరుని ఆలయంలో ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం ఏకాదశి సందర్భంగా ఉభయ నాంచురులతో కల్యాణ వెంకటేశ్వరస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యపూజలు చేశారు. ప్రత్యేక పుష్పాలతో, స్వర్ణాభరణాలతో అలంకరించి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఉభయనాంచారులతో స్వామివారిని మాడవీధులలో ఊరేగించారు. భక్తులు ఏకాదశి ఉపవాస దీక్షతో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారి నాగరాజు, అర్చకులు శ్రీధర్ భట్టాచార్యులు, శ్రీనివాస భట్టాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంతో ప్రమాదాల నుంచి రక్షణ



సదస్సులో మాట్లాడుతున్న ఎస్‌ఐ రాజశేఖర్

నారాయణవనం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ వినియోగంతో అనుకోని ప్రమాదాల నుంచి ప్రాణ రక్షణ ఉంటుందని ఎస్‌ఐ రాజశేఖర్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో హెల్మెట్ వాడకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు ఇద్దరికి మించి ద్విచక్ర వాహనాలపై ప్రయాణించవద్దని సూచించారు. గంజాయి, గుట్కా లాంటి సేవించడం వలన జీవితాలు నాశనం అవుతాయని హెచ్చరించారు. గుర్తు తెలియని వ్యక్తులకు ఎలాంటి ఓటీపీలు చెప్పవద్దని, ఆధార్ కార్డు, బ్యాంకు, వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ రెడ్డి, ఏఎస్‌ఐ జయరాం నాయక్, పోలీసు సిబ్బంది, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పేదల గుండె చప్పుడు వంగవీటి మోహనరంగ



మోహనరంగాకు నివాళులు అర్పిస్తున్న సిద్ధులగారి ప్రసాద్

శ్రీకాళహస్తి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): నిరుపేద కార్మికుల గుండె చప్పుడు వంగవీటి మోహనరంగా అన్ని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి మాజీ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు అన్నారు. వంగవీటి మోహనరంగా వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద బలిజ సామాజిక వర్గం ఆధ్వర్యంలో వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిం చారు. పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్య క్రమం లో ఉప్పు కృష్ణయ్య, పూల కృష్ణమూర్తి, స్వర్ణ మూర్తి, అంజూరు వెంకటేష్‌బాబు, సత్య నారాయణ, పురుషోత్తం, శరవణ, సాధన మున్నా తదితరులు పాల్గొన్నారు.

● బడుగుల ఆశాజ్యోతి వంగవీటి రాధారంగా మిత్రమండలి నియోజకవర్గ అధ్యక్షుడు సిద్ధులగారి ప్రసాద్ ఆధ్వర్యంలో కార్గిల్ సెంటర్‌లో వంగవీటి మోహనరంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సుబ్బారావు, చిరంజీవులు, నాదముని, వేణుగోపాల్, గరికపాటి చంద్రశేఖర్, శివకుమార్, చంద్ర, వెంకటేష్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



పురవీధుల్లో నిర్వహిస్తున్న ర్యాలీ

శ్రీకాళహస్తి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత అందరి బాధ్యత అని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ అన్నారు. రోడ్డు భద్రత నియమాలపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అందులో భాగంగా పట్టణంలోని ది స్కూల్ నుంచి వీఎంసీ కూడలి, జయరామరావువీధి, బజారువీధి, తేరువీధి, నెహ్రూరోడ్డు, సినిమావీధి, ఆర్టీసీ బస్టాండు వరకు ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాల న్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నరసింహమూర్తి, సీఐలు, ఎస్‌ఐలు, ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆటో డ్రైవర్ మృతి

రేణిగుంట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ ఆటో డ్రైవర్ మృతి చెందాడు. వాల్‌మార్ట్ సమీపంలో రోడ్డు దాటుతుండగా నాగరాజును గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆయన్ను తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసు స్టేషన్ రైటర్ గౌరీ తెలిపారు.

సాహిత్యంపై ఆసక్తి ఉండాలి : ఆదిమూలం



బహుమతులు పొందిన విద్యార్థులతో ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశనుండే ప్రతి ఒక్కరూ సాహిత్యంపై ఆసక్తి కలిగి ఉండాలని ఎమ్మెల్యే ఆదిమూలం విద్యార్థులకు సూచించారు. మండలంలోని మదనంబేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇటీవల ప్రజా కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు అరవ జయపాల్ ఆధ్వర్యంలో 'చలం గారి సాహిత్యం' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు సాహిత్యంపై మక్కువ పెంచుకుని మాతృభాషను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చినబాబు, మాజీ ఎంపీపీ మస్తాన్, సర్పంచ్ శివరంజని, వైస్ ఎంపీపీ సరోజిని, నాయకులు పరమశివం, ఇళంగోవన్ రెడ్డి, చిన్నా, షణ్ముగం, వెంకటరమణ, ధనశేఖర్, బాబు, శశి పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు భూమిపూజ

అదే గ్రామంలో అట్‌స్పా అనాథ ఆశ్రమం వద్ద రూ.3లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే చేతుల మీదుగా భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఆశ్రమ విద్యార్థులతో మాట్లాడారు. అనాథ పిల్లల కోసం రూ.10 వేలు ఆర్థికసాయాన్ని అందించారు.

ముక్కంటి సేవలో తమిళనాడు గవర్నర్



శ్రీకాళహస్తి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని గురువారం తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేద పండితులు ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు మునిరాజానాయుడికి సత్కారం



శ్రీకాళహస్తి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): సహకార పాలసరఫరా సంఘం మాజీ ఛైర్మన్, టీడీపీ నేత రావిళ్ల మునిరాజానాయుడిని గురువారం శ్రీకాళహస్తి పాలసరఫరా సంఘం భవనంలో సన్మానించారు. ఆయన జన్మదినం సందర్భంగా సంఘం ఛైర్మన్ మునగాల మధుసూదన్‌నాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా ఖాదర్‌వలీ గంధ మహోత్సవం

శ్రీకాళహస్తి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కైకాలవీధిలో ఉన్న హజరత్ ఖాదర్‌వలీ గంధమహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. దర్గా నిర్వాహకులు దీలు సాహెబ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. దర్గాలో పూల చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆరీఫ్, గఫూర్, ఖాదర్, కాలేషా, జుబేర్, అలి, షెురా, రఫీ, మీర్జావలి తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర గవర్నర్‌కు ఘనంగా వీడ్కోలు

రేణిగుంట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్ర గవర్నర్ సీపీ.రాధాకృష్ణన్‌కు గురువారం బీజేపీ శ్రీకాళహస్తి అసెంబ్లీ కన్వీనర్ కోలా ఆనంద్ ఘనంగా వీడ్కోలు పలికారు. తిరుమల పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణమైన ఆయనకు తిరుపతి విమానాశ్రయంలో కలిసి సత్కరించారు. శ్రీకాళహస్తీశ్వరుని తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి, భరత్‌కుమార్ నాయుడు, హరిష్, పోలయ్య, రాఘవనాయుడు, హరీష్‌రెడ్డి, బిందుకుమార్, గిరిధర్‌సాయి త దితరులు పాల్గొన్నారు.